మా కలం.. మీ గళం..

RNI : APTEL/ 2017/74310

# మన గళం

దిన పత్రిక

పబ్లిషర్స్ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ | ఎడిటర్ : నంద కిషోర్ | సంపుటి : 08 | సంచిక : 92 | శనివారం | 13 - 09 - 2025 | పేజీలు: 8 | వెల: 4

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి




4లో..

### 2034 నాటి ఆంధ్రప్రదేశ్ భవిష్యత్‌పై

# ప్రణాళిక ఆవిష్కరణ

- 2034 నాటికి రూ. 57 లక్షల కోట్ల జీఎస్‌డీపీ సాధనే లక్ష్యం
- ప్రతి వ్యక్తి తలసరి ఆదాయం రూ. 10 లక్షలు దాటించడమే టార్గెట్
- సూపర్ సిక్స్‌తో సంక్షేమం, ప్రణాళికలతో అభివృద్ధికి సమ ప్రాధాన్యం
- కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వాలేనని ధీమా వ్యక్తం చేసిన సీఎం చంద్రబాబు

మన గళం, అమరావతి : రాబోయే దశాబ్ద కాలంలో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా నిలబెట్టడమే లక్ష్యమని, ఇందుకోసం ఒక స్పష్టమైన, బృహత్తరమైన ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటించారు. 2034 నాటికి రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ)ని రూ. 57 లక్షల కోట్లకు, ప్రతి వ్యక్తి తలసరి ఆదాయాన్ని రూ. 10.55 లక్షలకు చేర్చడమే ధ్యేయంగా ఎన్డీఏ ప్రభుత్వం పనిచేస్తుందని ఆయన స్పష్టం చేశారు. 'వే2న్యూస్ సంస్థ నిర్వహించిన కాంక్లేవ్‌లో పాల్గొన్న ఆయన, 'స్వర్ణాంధ్ర-2047' విజన్‌ను ఆవిష్కరించి, భవిష్యత్ కార్యాచరణను వివరించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, "కేవలం విజన్ రూపొందించడంతోనే సరిపెట్టకుండా, దాన్ని ఆచరణలో సాధ్యం చేసే దిశగా పనిచేయాలి. జాతీయ స్థాయిలో 'వికసిత్ భారత్-2047'కు అనుగుణంగా రాష్ట్రంలో 'స్వర్ణాంధ్ర-2047' విజన్‌ను సిద్ధం చేశాం. ఈ లక్ష్యాలను సాధించడం అసాధ్యమేమీ కాదు. కచ్చితమైన ఆలోచన, బలమైన సంకల్పం ఉంటే ఏదైనా సాధ్యమే" అని అన్నారు. రాష్ట్రంలోని భాగస్వాములందరినీ కలుపుకొని ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని ఆయన తెలిపారు. రాష్ట్ర ఆర్థిక ప్రగతికి సంబంధించిన నిర్దిష్ట లక్ష్యాలను ఆయన ప్రజల ముందుంచారు.



ఈ ఏడాది, గత ఏడాది రెండంకెల వృద్ధి సాధించగలిగాం. ఇదే స్ఫూర్తితో 2028-29 నాటికి రాష్ట్ర జీఎస్‌డీపీని రూ. 29.29 లక్షల కోట్లకు, తలసరి ఆదాయాన్ని రూ. 5.42 లక్షలకు చేరుస్తాం. ఆ తర్వాత, 2034 నాటికి జీఎస్‌డీపీని రూ. 57.21 లక్షల కోట్లకు, తలసరి ఆదాయాన్ని రూ. 10.55 లక్షలకు పెంచేలా ప్రణాళికలు రూపొందించాం. ఈ మెగా డ్రీమ్‌ను నిజం చేసే బాధ్యతను ఎన్డీఏ కూటమి తీసుకుంటుంది" అని చంద్రబాబు భరోసా ఇచ్చారు. గత అనుభవాలను గుర్తుచేసుకుంటూ, "ఒకప్పుడు భారతీయులకు ప్రపంచంలో సరైన

2 లో..



### ఉపరాష్ట్రపతిగా సీపీ రాధాకృష్ణన్

# ప్రమాణ స్వీకారం

- ప్రమాణం చేయించిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము
- హాజరైన ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు, ప్రముఖులు

మన గళం, న్యూఢిల్లీ : భారతదేశ 15వ ఉపరాష్ట్రపతిగా సీపీ రాధాకృష్ణన్ ఈ రోజు బాధ్యతలు చేపట్టారు. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో అత్యంత వైభవంగా జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆయన చేత పదవీ ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, జేపీ నడ్డా సహా పలువురు మంత్రులు, ఎన్డీయే భాగస్వామ్య పక్షాల నేతలు హాజరయ్యారు. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, మాజీ ఉపరాష్ట్రపతులు జగదీప్ ధన్‌ఖడ్,

2 లో..

## ఢిల్లీ హైకోర్టుకు బెదిరింపు మెయిల్




### మధ్యాహ్నం లోపు కోర్టులో బాంబు పేలుతుందని హెచ్చరిక
### వెంటనే అప్రమత్తమైన భద్రతా సిబ్బంది, పోలీసులు

మన గళం, న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీలోని హైకోర్టులో శుక్రవారం తీవ్ర కలకలం రేగింది. ఢిల్లీ హైకోర్టు ప్రాంగణంలో బాంబు పెట్టినట్లు ఆగంతుకులు పంపిన ఒక ఈ-మెయిల్ భద్రతా వర్గాలను ఉరుకులు పరుగులు పెట్టించింది. ఈ బెదిరింపుతో అప్రమత్తమైన పోలీసులు, భద్రతా సిబ్బంది వెంటనే హైకోర్టు ప్రాంగణాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఈరోజు మధ్యాహ్నం లోపు హైకోర్టులో బాంబు పేలుతుందని హెచ్చరిస్తూ గుర్తుతెలియని వ్యక్తులు ఈ-మెయిల్ పంపారు. సమాచారం అందిన వెంటనే అధికారులు స్పందించారు. ముందు జాగ్రత్త చర్యగా హైకోర్టు ప్రాంగణంలోని సిబ్బందిని,

2 లో..



### విలువైన పుస్తకాలు కొనుగోలు చేసిన

# పవన్ కల్యాణ్

- ఉపరాష్ట్రపతి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరు
- నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా సందర్శన

మన గళం, న్యూఢిల్లీ : ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తన ఢిల్లీ పర్యటనలో రాజకీయ కార్యక్రమాలతో పాటు తనకున్న పుస్తకాసక్తిని కూడా చాటుకున్నారు. శుక్రవారం ఉదయం నూతన ఉపరాష్ట్రపతి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరైన ఆయన, ఆ తర్వాత న్యూఢిల్లీలోని బహవల్పూర్ హౌస్‌లో ఉన్న ప్రతిష్టాత్మక నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా (ఎన్ఎస్‌డీ)ను

2 లో..

### జగన్ మానసిక పరిస్థితిపై

# సందేహంగా ఉంది


- వైసీపీ కేవలం 11 సీట్లకు పరిమితం కావడంతో జగన్ లో అసహనం
- కాంట్రాక్టర్లను బెదిరిస్తున్నారని ఆరోపించిన గంటా శ్రీనివాసరావు

మన గళం, అమరావతి : ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసి చూపిస్తే వారి స్పందన ఎలా ఉంటుందో చెప్పడానికి అనంతపురంలో నిర్వహించిన 'సూపర్ సిక్స్ - సూపర్ హిట్' సభే నిదర్శనమని మాజీ మంత్రి, టీడీపీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం విశాఖ ఎంవీపీ కాలనీలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో గంటా మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు చూసి మాజీ సీఎం జగన్ లో ఫ్రస్ట్రేషన్ పెరిగిపోతోందని అన్నారు. ఒకవైపు అసెంబ్లీ ఎన్నికల్లో

2 లో..



## కంగనా రనౌత్‌కు సుప్రీంకోర్టు చీవాట్లు



మన గళం, న్యూఢిల్లీ : బాలీవుడ్ నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్‌కు సుప్రీంకోర్టు చురకలు వేసింది. తనపై నమోదైన క్రిమినల్ డిఫమేషన్ కంప్లయింట్‌ను కొట్టివేసేలా ఆదేశాలు ఇవ్వాలంటూ ఆమె దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపేందుకు సర్వోన్నత న్యాయస్థానం

2 లో..

# ఇది భయమా? లేక బెదిరింపా..?

- నా కొడుకు ఇప్పటివరకు రాజకీయాల్లో అడుగు కూడా పెట్టలేదు
- పెట్టక ముందే వైసీపీ ఇంత గందరగోళం సృష్టిస్తున్నారు
- వైఎస్ఆర్ వారసుడు రాజారెడ్డే అని తేల్చేసిన షర్మిల



మన గళం, విశాఖపట్నం :
తన కుమారుడు సమయం వచ్చినప్పుడు రాజకీయ రంగప్రవేశం చేస్తాడని.. షర్మిల బహిరంగంగానే ప్రకటించారు. దీంతో రాజారెడ్డి వైఎస్సార్ వారసుడు అంటూ.. షర్మిల అనుచరులు భావిస్తున్నారు. దీనిపై సోషల్ మీడియాలో ఓ వర్గం నుంచి ట్రోల్స్ కూడా మొదలయ్యాయి. ఈ క్రమంలో వైఎస్ షర్మిల ఘాటుగా స్పందించారు. వైఎస్ రాజారెడ్డి నిజమైన వైఎస్సార్ రాజకీయ వారసుడేనని, దీని విషయంలో ఎలాంటి

2 లో..

### శ్రీవారి సేవకుల

# సేవలు అమోఘం



మన గళం, తిరుమల : తిరుమల లోని వివిధ ప్రాంతాల్లో భక్తులకు శ్రీవారి సేవకులు అందిస్తున్న సేవలు అమోఘమని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రశంసించారు. శుక్రవారం వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న అనంతరం మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్న ప్రసాద కేంద్రంలో ఆమె అన్న ప్రసాదం

2 లో..

# బీజాపూర్‌లో ఎన్‌కౌంటర్

### ఎదురుకాల్పులు ఇద్దరు మావోయిస్టులు మృతి

మన గళం, బీజాపూర్: ఛత్తీస్‌గఢ్‌లో బీజాపూర్ జిల్లాలో మావోయిస్టులు, భద్రతా బలగాలకు మధ్య ఎదురుకాల్పులు కొనసాగుతున్నాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో ఇప్పటివరకు ఇద్దరు మావోస్టులు మరణించారు. బీజాపూర్‌లోని అటవీ ప్రాంతంలో

2 లో..



మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక



## ఉపరాష్ట్రపతిగా సీపీ రాధాకృష్ణన్ ప్రమాణ స్వీకారం




వెంకయ్యనాయుడు కూడా ఈ వేడుకలో పాల్గొన్నారు. అలాగే ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పాల్గొన్నారు. రాజీనామా చేసిన తర్వాత ధన్‌ఖడ్ బహిరంగంగా కనపడడం ఇదే తొలిసారి. ఇటీవల జరిగిన ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థిగా బరిలోకి దిగిన రాధాకృష్ణన్, విపక్షాల ఉమ్మడి అభ్యర్థి జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డిపై 152 ఓట్ల తేడాతో విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ ఎన్నికల్లో రాధాకృష్ణన్‌కు 452 ఓట్లు రాగా, సుదర్శన్ రెడ్డికి 300 ఓట్లు పోలయ్యాయి. ఈ నేపథ్యంలోనే ఆయన గురువారం మహారాష్ట్ర గవర్నర్ పదవికి రాజీనామా చేశారు. ప్రస్తుతం ఆ రాష్ట్ర గవర్నర్‌గా గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవవ్రత్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. చిన్న వయసులోనే ఆర్ఎస్ఎస్ భావజాలానికి ఆకర్షితులైన రాధాకృష్ణన్, తన 16వ ఏటనే రాజకీయాల్లోకి ప్రవేశించారు. తమిళనాడు బీజేపీలో కార్యదర్శిగా, అధ్యక్షుడిగా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. 1998, 1999 లోక్‌సభ ఎన్నికల్లో కోయంబత్తూర్ నుంచి రెండుసార్లు ఎంపీగా గెలుపొందారు. తన అనుచరులు ఆయన్ను 'తమిళనాడు మోదీ' అని పిలుచుకుంటారు. మహారాష్ట్ర గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టడానికి ముందు ఆయన జార?ండ్ గవర్నర్‌గా, తెలంగాణ ఇన్‌చార్జి గవర్నర్‌గా, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గానూ సేవలు అందించారు.

## బీజాపూర్‌లో ఎన్‌కౌంటర్

మావోయిస్టుల కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో మావోస్టులు తారపడటంతో ఇరు పక్షాల మధ్య కాల్పులు జరిగాయి. పోలీసుల ఫైరింగ్‌లో ఇద్దరు మావోయిస్టులు మృతిచెందారు. ఘటనా స్థలంలో 303 రైఫిల్‌తోపాటు ఆయుధ సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఆ ప్రాంతంలో కాలులు ఇంకా కొనసా గుతున్నాయని, మృతులను ఇంకా గుర్తించాల్సి ఉందని బీజాపూర్ ఎస్పీ జితేంద్ర యాదవ్ తెలిపారు. కాగా, గరియాబంద్ జిల్లాలో గురువారం జరిగిన ఎదురుకాల్పుల్లో పది మంది మావోయిస్టులు మృతిచెందిన విషయం తెలిసిందే. మైనపూర్ పోలీస్‌స్టేషన్ పరిధి భాలూ డిగ్గి సమీప అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నట్లు పోలీసు అధికారులకు విశ్వసనీయ వర్గాల ద్వారా సమాచారం అందింది. దీంతో కోబ్రా, గరియాబంద్ జిల్లాకు చెందిన ఈ-30, స్పెషల్ టాస్క్‌ఫోర్స్(ఎస్‌టీఎఫ్) భద్రతా బలగాలు సంయుక్తంగా సెర్చింగ్ ఆపరేషన్ నిర్వహించాయి. ఈ క్రమంలో వారికి మావోయిస్టులు తారసపడి జవాన్లపైకి కాల్పులు జరిపారు. అప్రమత్తమైన జవాన్లు ఎదురుకాల్పులకు దిగడంతో ఇరువర్గాల మధ్య భీకరపోరు సాగింది. జవాన్ల ధాటికి తాళలేక మావోయిస్టులు కాల్పులు జరుపుతూనే దట్టమైన అటవీ మార్గంలోకి పారిపోయారు.

అనంతరం జవాన్లు ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని గాలింపు చర్యలు చేపట్టారు. ఘటనా స్థలం నుంచి మావోయిస్టుల మృతదేహాలతోపాటు వారికి సంబంధించిన ఆయుధ, వస్తు, సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. కాగా, మృతిచెందిన వారిలో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు మోడెం బాలకృష్ణ అలియాస్ మనోజ్ అలియాస్ భాస్కర్‌తోపాటు ఒడిశా రాష్ట్ర జోనల్ కమిటీ సభ్యుడు(ఎస్‌జెడ్‌సీఎం) ప్రమోద్ అలియాస్ పాండు మృతిచెందినట్లుగా పోలీస్ అధికారులు తెలిపారు.

## 2034 నాటి ఆంధ్రప్రదేశ్ భవిష్యత్‌పై ప్రణాళిక ఆవిష్కరణ



గుర్తింపు లేని సమయంలో, తెలుగు బిడ్డ పీవీ నరసింహారావు ప్రధానిగా చేపట్టిన సంస్కరణలతో దేశ ప్రగతి పరుగులు పెట్టింది. 2038 నాటికి భారత్ ప్రపంచంలోనే నంబర్-1 స్థానానికి చేరుకుంటుంది. ఇందులో తెలుగువారి పాత్ర కీలకంగా ఉండాలి" అని ఆకాంక్షించారు. తాను గతంలో అమలు చేసిన విజన్ 2020 సాకారమైన తర్వాత కూడా ఇంకా కొందరు అనుమానాలు వ్యక్తం చేయడం సరికాదన్నారు. సంక్షేమం, అభివృద్ధిని సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళతామని చంద్రబాబు స్పష్టం చేశారు. భారత్ లాంటి దేశంలో సంక్షేమం, అభివృద్ధి రెండూ సమాంతరంగా సాగాలి. సూపర్ సిక్స్ పథకాల ద్వారా సంక్షేమానికి పెద్దపీట వేస్తూనే, సంపద సృష్టి ద్వారా అభివృద్ధికి సమానంగా నిధులు కేటాయిస్తాం. నేను కేవలం రాజకీయాల గురించే ఆలోచించి ఉంటే హైదరాబాద్ అభివృద్ధి చెందేది కాదు, విద్యుత్ సంస్కరణలు వచ్చేవి కావు. ఇప్పుడు పూర్తి బ్యాలెన్స్ చేస్తున్నాం. సంపద సృష్టించి, దాన్ని పేదలకు పంచుతున్నాం అని వివరించారు.

## ఢిల్లీ హైకోర్టుకు బెదిరింపు మెయిల్




న్యాయవాదులను, ఇతర సందర్శకులను వెంటనే బయటకు పంపించి, ప్రాంగణాన్ని పూర్తిగా ఖాళీ చేయించారు. సమాచారం అందుకున్న బాంబ్ స్క్వాడ్ బృందాలు, డాగ్ స్క్వాడ్‌తో కలిసి హుటాహుటిన హైకోర్టుకు చేరుకున్నాయి. కోర్టులోని ప్రతి గదిని, ప్రాంగణంలోని అన్ని ప్రదేశాలను క్షుణ్ణంగా తనిఖీ నిర్వహించాయి. ప్రస్తుతానికి ఎక్కడా ఎలాంటి పేలుడు పదార్థాలు లభించలేదని పోలీసులు తెలిపారు. మెయిల్ వచ్చిన ఐపీ అడ్రస్‌ను గుర్తించేందుకు దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. కనిమొళి తేవిడియా పేరుతో వచ్చిన ఆ మెయిల్‌లో ఈ వారంలో తమిళనాడు ఉపముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ కుమారుడి పైనా దాడులు చేస్తామని బెదిరింపులకు పాల్పడినట్లు వెల్లడించారు. బాంబే హైకోర్టుకు కూడా బాంబు బెదిరింపు మెయిల్ వచ్చినట్లు ముంబై పోలీసులు తెలిపారు. కోర్టు ప్రాంగణాన్ని ఖాళీ చేయించి గాలింపు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. న్యాయస్థానం ప్రాంగణంలో ఎలాంటి పేలుడు పదార్థాలు లభ్యం కాలేదని, ఇది నకిలీ బాంబు బెదిరింపుగా గుర్తించినట్లు తెలిపారు.

## విలువైన పుస్తకాలు కొనుగోలు చేసిన పవన్ కల్యాణ్

సందర్శించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌డీ ఆవరణలోని పుస్తకాల దుకాణంలో పలు పుస్తకాలను ఆసక్తిగా గమనించి, కొన్ని విలువైన పుస్తకాలను కొనుగోలు చేశారు. రాజకీయాలతో నిత్యం బిజీగా ఉండే పవన్ కల్యాణ్, కాస్త సమయం దొరకగానే తన అభిమాన అంశమైన పుస్తకాలపై దృష్టి సారించడం అందరినీ ఆకట్టుకుంది. కళలు, నాటకరంగంపై ఆయనకున్న అభిమానానికి ఈ సందర్శన అద్దం పడుతోంది. అంతకుముందు, భారత 15వ ఉపరాష్ట్రపతిగా సి.పి. రాధాకృష్ణన్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి పవన్ కల్యాణ్ హాజరయ్యారు. రాష్ట్రపతి భవన్‌లోని గణతంత్ర మండపంలో జరిగిన ఈ వేడుకలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పాల్గొన్నారు. ఈ కార్యక్రమం అనంతరం పవన్ కల్యాణ్ స్పందించారు.

నూతన ఉపరాష్ట్రపతిగా రాధాకృష్ణన్‌ను ఏకగ్రీవంగా ఎంపిక చేసినందుకు ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీ నాయకత్వం, ఎన్డీఏ భాగస్వామ్యపక్షాల నేతలకు ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. "తన అపార అనుభవంతో రాధాకృష్ణన్ ఉపరాష్ట్రపతి పదవికి గొప్ప గౌరవాన్ని తీసుకువస్తారు. రాజ్యసభలో అర్థవంతమైన చర్చలు జరిగేలా చూస్తారని విశ్వసిస్తున్నాను" అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి హాజరై శోభను తీసుకువచ్చిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు



కూడా ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## కంగనా రనౌత్‌కు సుప్రీంకోర్టు చీవాట్లు

నిరాకరించింది. కంగనా తన పిటిషన్‌ను ఉపసంహరించుకోవాలని, ట్రయల్ కోర్టుకు వెళ్లాలని సూచించింది. దాంతో కంగనా రనౌత్ సుప్రీంకోర్టులో దాఖలుచేసిన తన పిటిషన్‌ను ఉపసంహరించుకున్నారు. 2021లో ఢిల్లీ సరిహద్దుల్లో జరిగిన రైతుల ఆందోళన సందర్భంగా మహిందర్ కౌర్ అనే వృద్ధ మహిళను కించపర్చేలా రీట్వీట్ చేశారు. ఆమె రూ.100 కిరాయికి వస్తుందని తన రీట్వీట్‌లో పేర్కొన్నారు. దాంతో మహిందర్ కౌర్ పరువునష్టం కేసు వేశారు. దాంతో కౌర్ ఫిర్యాదును కొట్టివేసేలా ఆదేశాలు ఇవ్వాలని కంగనా ముందుగా హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఆమె పిటిషన్‌ను తోసిపుచ్చడంతో సుప్రీంకోర్టుకు వెళ్లారు. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు ఆమెకు చీవాట్లు పెట్టింది. 'మీ వ్యాఖ్యలకు అర్థం ఏమిటి..? మీది సింపుల్ రీట్వీట్ కాదు. మీరు మీ సొంత కామెంట్స్ చేశారు. మసాలా జోడించారు' అని జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ విక్రమ్ నాథ్‌లతో కూడిన సుప్రీం ధర్మాసనం వ్యాఖ్యానించింది. దాంతో తన క్లయింట్ ఆ రీట్వీట్‌పై క్లారిఫికేషన్ ఇచ్చారని కంగనా తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లగా.. ఆ క్లారిఫికేషన్ ట్రయల్ కోర్టుకు ఇవ్వండని ధర్మాసనం సూచించింది. కంగనా పంజాబ్‌కు వెళ్లే పరిస్థితి లేదని న్యాయవాది చెప్పగా.. వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు కోరవచ్చని కోర్టు పేర్కొంది. న్యాయవాది మరేదో వాదన చేయబోతుండగా.. 'ఆమె ట్వీట్‌పై మా స్పందన కోరే ప్రయత్నం చేయకండి' అని న్యాయస్థానం ఘాటుగా వ్యాఖ్యానించింది.

## ఇది భయమా? లేక బెదిరింపా..?

అనుమానం లేదని ఆమె స్పష్టంచేశారు. నా కొడుకు ఇప్పటివరకు రాజకీయాల్లో అడుగు కూడా పెట్టలేదు. పెట్టక ముందే వైసీపీ ఇంత గందరగోళం సృష్టిస్తుంటే ఇది భయమా? లేక బెదిరింపా? వాళ్లకే తెలిసిన విషయం. నా కుమారుడికి 'వైఎస్ రాజారెడ్డి' అనే పేరు స్వయంగా నా నాన్నగారు వైఎస్సార్ పెట్టారు. వైసీపీ ఎంత కేకలు వేసినా, ఎన్ని అడ్డంకులు పెట్టినా ఈ పేరును ఎవ్వరూ మార్చలేరు" అని షర్మిల గట్టిగా చెప్పారు. చంద్రబాబు చెప్తేనే.. తన కొడుకును రాజకీయాల్లోకి తీసుకొచ్చినట్లు ఓ వీడియోను మార్ఫ్ చేసి ప్రచారం చేస్తున్నారని అది చూసి తనకు నవ్వు వచ్చిందన్నారు షర్మిల. ఉపరాష్ట్రపతి ఎన్నికలలో జగన్ వైఖరిని టార్గెట్ చేస్తూ షర్మిల నిలదీశారు. వైఎస్సార్ జీవితాంతంలను వ్యతిరేకించారని.. కానీ ఆయన కొడుకే అభ్యర్థికి మద్దతు ఇవ్వడం అవమానకరమన్నారు. రాజ్యాంగం గురించి లోతుగా తెలిసిన న్యాయ నిపుణుడు సుదర్శన్ రెడ్డికి ఎందుకు మద్దతు ఇవ్వలేదు? జగన్ సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. అదానీ, రిలయన్స్ వ్యవహారాలను ప్రస్తావిస్తూ షర్మిల విమర్శలు గుప్పించారు. "వైఎస్సార్ మరణం వెనుక రిలయన్స్ కుట్ర ఉందని జగన్ చెప్పాడు. కానీ అదే రిలయన్స్ వారికి రాజ్యసభ సీటు ఇచ్చాడు. అదానీ కోసం గంగవరం పోర్ట్‌ను త్యాగం చేశాడు. ఐదు ఏళ్ల అధికారంలో ప్రతీ బిల్లుకు జగన్ మద్దతు ఇచ్చాడు. ఇప్పుడు ఏ ముఖంతో ఈ మద్దతు ఇస్తున్నారో జగన్ సమాధానం చెప్పాలి," అని డిమాండ్ చేశారు. పక్క రాష్ట్రంలో నిశ్శబ్దంగా ఉండగా, వైసీపీ మాత్రం ఓటు వేసిందని ఆమె మండిపడ్డారు.

## శ్రీవారి సేవకుల సేవలు అమోఘం

స్వీకరించారు. అన్న ప్రసాద కేంద్రం వద్దకు చేరుకున్న ఆమెకు టీటీడీ బోర్డు సభ్యులు సుచిత్ర ఎల్లా, భాను ప్రకాష్ రెడ్డి, అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి స్వాగతం పలికారు. ఆమె భోజనశాల వద్దకు చేరుకుని శ్రీవారి సేవకులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా భక్తులకు స్వయంగా అన్న ప్రసాదాలను వడ్డించారు. అన్న ప్రసాదం స్వీకరించిన అనంతరం టీటీడీ ఫీడ్ బ్యాక్ పుస్తకంలో తన అభిప్రాయాన్ని లిఖితపూర్వకంగా తెలిపారు. ఇతర భక్తులతో కలిసి అన్న ప్రసాదం స్వీకరించడం హృదయానికి హత్తుకుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవోలు రాజేంద్ర, భాస్కర్, వీజీవో సురేంద్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## జగన్ మానసికపరిస్థితిపై సందేహంగా ఉంది

వైసీపీ 11 సీట్లకే పరిమితం కావడం, మరోవైపు టీడీపీ కూటమి ప్రభుత్వం చేపడుతున్న ప్రజాహిత కార్యక్రమాలతో జగన్ తీవ్ర అసహనానికి లోనవుతున్నారని ఆయన ఆరోపించారు. గత ఎన్నికల్లో ఆ 11 సీట్లన్నా వచ్చాయి.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అవి కూడా రావని గంటా ఎద్దేవా చేశారు. తాజాగా సూపర్ సిక్స్.. సూపర్ హిట్ సభపైనా, మంత్రులపైనా జగన్ చేసిన వ్యాఖ్యలు చూస్తుంటే ఆయన మానసిక పరిస్థితిపై సందేహం కలుగుతోందని అన్నారు. ముఖ్యమంత్రి, హోం, వ్యవసాయ మంత్రులపై ఇష్టారీతిన మాట్లాడుతున్నారని ఆరోపించారు. కాంట్రాక్టర్లను బెదిరిస్తున్నారని విమర్శించారు. వైసీపీ పాలనలో ఆ పార్టీ కార్యాలయాలు తప్ప ఇంకేమీ నిర్మించలేదని, నర్సీపట్నంలో వైద్య కళాశాల నిర్మాణ పనులు కేవలం 8 శాతం మాత్రమే పూర్తి చేశారని చెప్పారు. రుషికొండ ప్యాలెస్ కోసం వెచ్చించిన రూ.500 కోట్లను మెడికల్ కాలేజీలపై పెడితే ఇప్పటికే పూర్తయ్యేవని అన్నారు. వైసీపీ పాలనకంటే రాష్ట్ర ప్రజలకు మెరుగైన పాలన అందిస్తున్నామని, ఈ విషయంపై ఎక్కడైనా సరే చర్చకు సిద్ధమని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు.

## అమరావతి నిర్మాణం రాష్ట్రానికి తలకు మించిన భారం

మన గళం డెస్క్ : ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణంపై వైసీపీ తమ వైఖరిని మరోసారి స్పష్టం చేసింది. అమరావతిని ప్రస్తుత ప్రదేశంలో నిర్మించడం రాష్ట్రానికి ఆర్థికంగా పెనుభారమని, ఇది ఆచరణ సాధ్యం కాదని పేర్కొంది. దీనికి బదులుగా, విజయవాడ-గుంటూరు నగరాల మధ్య రాజధానిని నిర్మిస్తే రాష్ట్రానికి మేలు జరుగుతుందని, శాశ్వత పరిష్కారం లభిస్తుందని ప్రభుత్వానికి కీలక సూచన చేసింది. వైసీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి శుక్రవారం నాడు మీడియాతో మాట్లాడుతూ, అమరావతి నిర్మాణంపై చంద్రబాబు ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును విమర్శించారు. "అమరావతి ప్రాంతం నదీ గర్భంలా ఉంది. అక్కడ భవనాలు కట్టాలంటే పునాదుల కోసమే వందల అడుగుల లోతుకు వెళ్లాలి. దీనివల్ల నిర్మాణం ఖర్చు తలకు మించిన భారంగా మారి, రాష్ట్రాన్ని లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి నెడుతుంది" అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. చంద్రబాబు తన రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం రాష్ట్రాన్ని పణంగా పెట్టారని ఆరోపించారు. ఈ ఆర్థిక భారం నుంచి రాష్ట్రాన్ని కాపాడేందుకే జగన్ ఆచరణాత్మకమైన సలహా ఇస్తున్నారని సజ్జల తెలిపారు. "విజయవాడ-గుంటూరు మధ్య రాజధానిని నిర్మిస్తే ఖర్చు గణనీయంగా తగ్గుతుంది. మచిలీపట్నం పోర్టు, ఔటర్ రింగ్ రోడ్డుతో అనుసంధానం వల్ల ఆ ప్రాంతం ఒక మహానగరంగా అభివృద్ధి చెందడానికి అవకాశం ఉంటుంది" అని ఆయన వివరించారు. ప్రభుత్వం ఇప్పటికైనా వాస్తవికంగా ఆలోచించి, రాష్ట్రాన్ని అప్పులపాలు చేయకుండా ఈ పరిష్కారాన్ని స్వీకరించాలని సజ్జల కోరారు. ప్రభుత్వం మొండిగా ముందుకు వెళితే, రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం మళ్లీ కొత్త ఆలోచనలు చేయాల్సి వస్తుందని, వికేంద్రీకరణ వంటివి మరో రూపంలో తెరపైకి వచ్చే అవకాశం ఉంటుందని పరోక్షంగా హెచ్చరించారు. రాజధాని భవిష్యత్తుపై తుది నిర్ణయం చంద్రబాబు చేతుల్లోనే ఉందని రాష్ట్రాన్ని కాపాడతారో, లేదో ఆయనే తేల్చుకోవాలని సజ్జల వ్యాఖ్యానించారు.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# కర్నూలు జిల్లా కలెక్టర్ గా సిరి



మనగళం, కర్నూలు కలెక్టరేట్ : కర్నూలు జిల్లా నూతన కలెక్టర్గా డాక్టర్ అట్టాడ సిరి నియమితులయ్యా రు. సెకండరీ హెల్త్ డైరెక్టర్ గా ఉన్న ఆమెను జిల్లా కలెక్టర్ గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుత కలెక్టర్ రంజిత్ బాషాను బదిలీ చేసిన ప్రభుత్వం ఆయనకు పోస్టింగ్ ఇవ్వాల్సి ఉంది.

# శని, ఆది వారాల్లో కర్నూలు మార్కెట్ యార్డులో ఉల్లి బహిరంగ వేలం

మనగళం, కర్నూలు సిటీ : కర్నూలు మార్కెట్ యార్డులో శని, ఆది వారాల్లో (ఈ నెల 13,14 తేదీల్లో) ఉల్లి బహిరంగ వేలం నిర్వహించనున్నామని, ఈ వేలంలో రిటైలర్స్, హెూల్సేలర్స్, హెూటల్స్, హాస్టల్స్, ఇతర ఏజెన్సీలు, ఆసక్తి ఉన్న వ్యక్తులు పాల్గొనవచ్చని జాయింట్ కలెక్టర్ డా. బి. నవ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 13,14 తేదీల్లో కర్నూలు మార్కెట్ యార్డ్ కు సెలవు ప్రకటించినందున, రైతుల నుంచి మార్క్ ఫెడ్ కొనుగోలు చేసిన 2,800 టన్నుల ఉల్లిని బహిరంగం వేలం వేసే కార్యక్రమాన్ని చేపడుతున్నామని జేసీ తెలిపారు. ఈ రెండురోజుల్లో వేలంపాట ఉదయం 10 గంటలకు నిర్వహించబడుతుందని, ఆసక్తి ఉన్నవారు పాల్గొనాలని జేసీ సూచించారు.

# సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

**- 15న విజయవాడలో లేబర్ కమిషనర్ ఆఫీస్ ముట్టడి**



మనగళం, కర్నూలు సిటీ : కర్నూల్ నగరంలోని ఆర్ఎస్ రోడ్డు జంక్షన్ వద్ద సెప్టెంబర్ 15వ తేదీన విజయవాడలోని రాష్ట్ర లేబర్ కమిషనర్ ఆఫీస్ ముట్టడిని జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మికుల జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈసమావేశానికి సీఐటీయూ నగర నాయకులు ఏసు అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్ నరసింహులు, సీఐటీయూ నగర నాయకులు ఎస్ఎండి మహ్మద్ రఫీ భవన నిర్మాణ కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికులకు పనులు లేక చాలా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని, ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు పనుల కొరకువేచి ఉన్న పనులు దొరకక ఇళ్లకు తిరిగి వెళ్ళవలసిన దుస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. గత వైసీపీ ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు ఉన్నటువంటి సంక్షేమ బోర్డును నిలుపుదల చేసి కార్మికులకు తీవ్ర అన్యాయం చేసిందని, ప్రతిపక్షంలో ఉన్నటువంటి టీడీపీ మేము అధికారంలోకి వస్తే సంక్షేమ బోర్డును ప్రారంభిస్తామని చెప్పి హామీలు గుప్పించారని గుర్తు చేశారు. అయితే అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం సంక్షేమ బోర్డును ప్రారంభించకుండా కార్మికుల పట్ల దుర్మార్గంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. సంక్షేమ బోర్డును పునర్ ప్రారంభించాలని కోరుతూ సెప్టెంబర్ 15వ తేదీన చేపట్టనున్న రాష్ట్ర లేబర్ కమిషనర్ ఆఫీస్ ముట్టడిని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

# కిసాన్ కాంగ్రెస్ జిల్లా చైర్మన్ గా ఏ సూర్య ప్రకాశ్ రెడ్డి



మనగళం, కర్నూలు సిటీ : కర్నూలు జిల్లా కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ గా ఎ సూర్య ప్రకాష్ రెడ్డి నియమితులయ్యారు. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కామన ప్రభాకర్ రావు విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి కిసాన్ కాంగ్రెస్ సమావేశంలో నియామక పత్రం అందజేశారు. అనంతరం సూర్య ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ నా మీద నమ్మకంతో కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ గా నియమించిన జాతీయ కాంగ్రెస్ యువ నాయకులు రాహుల్ గాంధీ, ఏఐసీపీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి, జాతీయ కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ సుఖ పాల్ సింగ్ ఖైరా, ఏఐసీసీ కిసాన్ కాంగ్రెస్ ఏపీ ఇన్చార్జి నీలం రమేష్, రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ కామన ప్రభాకర్ రావుకు కృతజ్ఞతలు తెలిపారు. కర్నూలు జిల్లాలో కిసాన్ కాంగ్రెస్ ను బలోపేతం చేసి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై కూటమి ప్రభుత్వంతో పోరాడతామన్నారు. విజయవాడలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ కేంద్ర మంత్రి కనుమూరి బాపిరాజు, రాష్ట్ర కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్ వలి, కర్నూలు మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ కే రాఘవేంద్ర రెడ్డి పాల్గొన్నారు.

# ముగిసిన తితిదే ధార్మిక కార్యక్రమాలు





మనగళం, కర్నూలు సిటీ: సదాచారులైన సమాజ నిర్మాణంతో గ్రామంతో పాటు దేశం సర్వాంగీన ఉన్నతిని సాధిస్తుందని, గుడి – బడి ఈలక్ష్య సాధన కోసమే నిరంతరం పనిచేయాలని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచారపరిషత్ ఆధ్వర్యంలో మండ్లెం గ్రామంలోని శ్రీ రుక్మిణి పాండురంగ స్వామి దేవస్థానం నందు గత నాలుగు రోజులుగా జరుగుతున్న ధార్మిక కార్యక్రమాల్లో భాగంగా శు క్రవారం గోపూజ, కుంకుమార్చన కార్యక్రమాలను నిర్వహించారు. ముందుగా గోమాతతో ఊరేగింపుగా హరినామ సంకీర్తనలతో ఆలయానికి చేరుకున్నారు. ప్రత్యేక పూజలతో ధార్మిక కార్యక్రమాలు ముగిశాయి. మూడు రోజులపాటు స్థానిక భజన మండలి భజనలు, ఇస్కాన్ ధర్మ ప్రచారకులు కీర్తి రాజదాస్ చేసిన ధార్మిక ప్రవచనాలు భక్తులను మంత్రముగ్ధులను చేశాయి. ఈ కార్యక్రమంలో రుక్మిణి పాండురంగ స్వామి దేవస్థానం ధర్మకర్త పొలిమేర హనుమంతరావు, ధర్మ ప్రచారమండలి సభ్యులు పన్నంగి రామచంద్రుడు, అంబటి శివశంకర రెడ్డి, అర్చకులు మాకం కుమారస్వామి, శివమణి, విశ్వనాథం నారాయణ, కృష్ణయ్య, గానుగ శంకరయ్య, శ్రీ రామేశ్వర రెడ్డి, బాలమ్మ, పార్వతిదేవి, మల్లికాదేవి, రోశమ్మ సుంకులమ్మ, శేషమ్మ, మణి, పద్మావతమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఆటో, క్యాబ్, లారీ,టిప్పర్ కార్మికులను ఆదుకోవాలి



**- కూటమి పెద్దలు ఇచ్చిన హామీలు అమలు చేయాలి**

మనగళం, కర్నూలు సిటీ : రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనంతపురం సభలో ఆటో డ్రైవర్లకు వాహన మిత్ర పథకం కింద వచ్చే దసరాకి 15 వేల రూపాయలు ప్రకటించి చేతులు దులుపుకోవాలని ప్రయత్నిస్తున్నారని ఆటో యూనియన్ సీఐటీయూ నగర అధ్యక్ష కార్యదర్శులు దూదేకొండ కుమార్ మహమూద్ విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 15వ తేదీ నుండి మహిళలకు స్త్రీ శక్తి ఉచిత బస్సు పథకాన్ని రవాణా రంగ కార్మికుల సంఘాలతో చర్చించకుండా ఏకపక్షంగా అమలు చేయడం జరిగిందన్నారు. దీనివలన రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి ఆటో, క్యాబ్ డ్రైవర్లు తమ ఆదాయంలో 60 శాతానికి పైగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం అనంతపురం సూపర్ సిక్స్ సూపర్ హిట్ అంటూ నిర్వహించిన సభలో సీఎం చంద్రబాబు నాయుడు వాహన మిత్ర పథకం ద్వారా సంవత్సరానికి 15 వేల రూపాయలు ఇస్తామని, దసరా రోజున అమలు చేస్తామని ప్రకటించారు. ఇది ఎంత మాత్రం సమంజసం కాదని, ఎన్నికల హామీలలో చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు లైసెన్స్ ఉన్న ప్రతి డ్రైవర్ కు (ఆటో క్యాబ్, లారీ, బస్సు) సంవత్సరానికి 25 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆటోమేటిక్ సెంటర్లు అవినీతికి అడ్డగా మారాయని, తక్షణమే ఏటీసీ సెంటర్లను రద్దు చేయాలన్నారు. రవాణా కార్యాలయాల లోని ఫిట్నెస్ సర్టిఫికేట్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రవాణా రంగంలో ఉన్నటువంటి కార్మికుల కుటుంబాలకు భరోసానిచ్చే విధంగా సమగ్ర సంక్షేమ చట్టాన్ని అమలు చేస్తామని, జీవో నెంబర్ 21 రద్దు చేస్తామని, రవాణా రంగ కార్మికులకు 5% వడ్డీతో నాలుగు లక్షల వరకు రుణాలు ఇస్తామని హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. వీటన్నిటిపై ఎటువంటి ప్రకటన చేయకుండా వాహన మిత్ర ద్వారా కేవలం 2 లక్షల75 వేల మందికి మాత్రమే వాహన మిత్ర (ఆటో క్యాబ్ ఓనర్లకు) పథకాన్ని ఇస్తామని ప్రకటన చేయడాన్ని ఏపీ ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ ( సీఐటీయూ) ఓల్డ్ సిటీ కమిటీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి రవాణా రంగ కార్మికులందరికీ వర్తించేలా సంక్షేమ పథకాలు ప్రకటించాలన్నారు. వెంటనే ఆటోమేటిక్ సెంటర్ లను రద్దు చేయాలని, సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, అధిక పెనాల్టీలను వసూలు చేసే విధంగా రూపొందించిన జీవో నెంబర్ 21 వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తమ సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి రవాణా రంగ కార్మికులను సమీకరించి సెప్టెంబర్ 18వ తేదీ విజయవాడలో ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు.

# ఘనంగా సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి



మనగళం, కర్నూలు సిటీ : హక్కుల సాధనకు ఉద్యమించాలని, లౌకిక భావాలను కలుషితం చేస్తున్న మతోన్మాద శక్తుల కుట్రలను తిప్పికొట్టాలని సీపీఎం నాయకులు పిలుపునిచ్చారు. కర్నూల్ నగరంలోని స్థానిక సుందరయ్య జంక్షన్ లో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు వై.నగేష్ అధ్యక్షతన సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సందర్భంగా నాయకులు, కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పీఎస్. రాధాకృష్ణ, రాముడు, యండి ఆనంద్ బాబు, నగర కార్యదర్శి వర్గ సభ్యులు అర్. నరసింహులు ఏచూరి త్యాగాలను గుర్తు చేశారు. 1952 ఆగస్టు 12వ తేదీ మద్రాసులో జన్మించిన ఏచూరి తెలుగు రాష్ట్రాలలో చదువుకొని అనంతరం ఉన్నత చదువుల కోసం ఢిల్లీలోని జేఎన్యు విశ్వవిద్యాలయంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్, పీహెచ్డీ చేశారన్నారు. సీతారాం ఏచూరి జేఎన్యు ఎన్నికల్లో అధ్యక్షులుగా ఎన్నికై అనంతరం ఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షులుగా పనిచేసే 1975 ఎమర్జెన్సీలో అరెస్టై విడుదలయ్యారన్నారు. అనంతరం ఇందిరాగాంధీ ప్రధాని హెూదాలో పాల్గొన్న సభలో సీతారాం ఏచూరి పాల్గొని ఆమె విధించిన ఎమర్జెన్సీ పై గళం విప్పి దేశవ్యాప్తంగా ఉన్న మేధావులను ఆకర్షించారని గుర్తు చేశారు. సీపీఎం పూర్తి కాలం కార్యకర్తగా జీవితాన్ని ప్రారంభించి కేంద్ర కమిటీ సభ్యులుగా, పార్టీ పొలిటి బ్యూరో సభ్యులుగా, జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎదిగారని, రెండు పర్యాయాలు రాజ్యసభ సభ్యులుగా పార్లమెంటులో ఉత్తమ సేవలు అందజేశారని వివరించారు. ఆయన ఆశయ సాధనకు నాయకులు, కార్యకర్తలు పోరాడాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు కె.ప్రభాకర్, నగర కమిటీ సభ్యులు ఎస్ఎండి రఫిక్ , యం.భాస్కర్, జి.ఏసు, యస్.హుస్సేన్ భాష .వి.శంకర్, చిన్న వ్యాపారస్తులు, ఆటో కార్మికులు, హమాలి యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

# సమర్ధవంతమైన చికిత్స ప్రణాళికలలో పెథాలజీ కీలకం



మనగళం, కర్నూలు సిటీ : రోగ నిర్ధారణకు, సమర్ధవంతమైన చికిత్స ప్రణాళికల లో పెథాలజీ కీలకం అని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్ పి. చంద్రశేఖర్ పేర్కొన్నారు. వైద్య రంగం లో పరిశోధనలకి ప్రాధాన్యత ఇస్తున్నామని, ఇందుకు ప్రత్యేక నిధులు కూడా కేటాయిస్తున్నామన్నారు. శుక్రవారం కర్నూలు మెడికల్ కాలేజీ యందు "ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ పాథాలజీ అండ్ మైక్రో బయాలజీ" (ఐఏపీఎం) ఆధ్వర్యం లో నిర్వహిస్తున్న మూడు రోజుల "ఏపీ పాథ్కాన్ 2025" ను ఉపకులపతి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కాన్ఫరెన్స్ కు ఐఏపీఎం ప్రెసిడెంట్ డా.నీరజ మైరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్వాంటం టెక్నాలజీ వైపు అడుగులు వేస్తుందని, సీఎం నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు వైద్య విద్యా రంగం లో నూతన టెక్నాలజీని ఎప్పటికప్పుడు ప్రవేశపెడుతున్నామన్నారు. అందుకు అనుగుణంగా పరిశోధనలకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ హాస్పిటల్స్ సూపరిండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జబ్బులకు వైద్యం అందించడంలో పథాలజీ విభాగము అందించే రిపోర్టులే కీలకమని తెలిపారు. యువ వైద్యులు నూతన ఆవిష్కరణలను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలన్నారు. కేఎంసీ ఇన్చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ హరిచరణ్ మాట్లాడుతూ రోగులకు సర్జరీ చేయాలన్న వైద్యం అందించాలన్న పథాలజీ విభాగము వైద్యుల సహకారం తప్పనిసరి అన్నారు. ఏపీ పాథ్కాన్ ఆర్గనైజింగ్ ఛైర్మెన్ పథాలజీ విభాగపు అధిపతి డాక్టర్ బాలీశ్వరి మాట్లాడుతూ రాష్ట్రస్థాయి కాన్ఫరెన్స్ కేఎంసీలో నిర్వహించడం ఎంతో సంతోషాన్నిచ్చిందన్నారు. కార్యక్రమంలో రిటైర్డు వీసీ డా. ఏవీ కృష్ణమరాజు, ఐఏపీఎం సెక్రటరీ డా. మారుతి, ఐఏపీఎం అబ్జర్వర్ డా.శ్రీనివాసులు, ట్రెజరర్ డా. కుమార్ రాజు, విభాగాధిపతి డా. పీవీ రమణ బాబు, వివిధ కళాశాలల అకాలజీ విభాగపు ప్రొఫెసర్లు, అసోసియేట్లు, అసిస్టెంట్లు, పీజీలు తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- దసరా బిగ్ సేల్ ఆఫర్లు అంటూ మోసాలకు పాల్పడుతున్న సైబర్ నేరగాళ్లు
- ఆశపడి లింకులు ఓపెన్ చేస్తే మోసపోయినట్లే
- మోసం అని తెలుసుకునే లోపే మీ ఖాతాలోని నగదు ఖాళీ
- ఫెస్టివల్ ఆఫర్స్, బిగ్ సేల్ లింకులు ఓపెన్ చేయొద్దు
- హెచ్చరించిన జిల్లా ఎప్పీ విక్రాంత్ పాటిల్



మనగళం, కర్నూలు క్రైం : దసరా పండుగ దగ్గరలో ఉండటంతో ప్రత్యేక ఆఫర్లు అంటూ సైబర్ నేరగాళ్లు పలు రకాలుగా మోసాలకు పాల్పడుతున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ సూచించారు. ఈ మేరకు ప్రజలను హెచ్చరిస్తూ శుక్రవారం జిల్లా ఎస్పీ ఓ ప్రకటన విడుదల చేశారు. సైబర్ నేరగాళ్లు ఫేస్ బుక్, ఇన్ స్టా గ్రాం, వాట్సప్ లో ఆఫర్ల పేరుతో లింకులు పంపి మోసాలకు పాల్పడుతున్నారు. ఆ వాట్సాప్ నుంచి వచ్చిన లింకులు ఓపెన్ చేయగానే మీరు కారు, సెల్ ఫోన్ లు వంటివి గెలుచుకున్నారంటూ మోసాలకు పాల్పడుతున్నారన్నారు. బహుమతులు తీసుకునేందుకు మీ వాట్సాప్ గ్రూప్ మిత్రులకు ఆ లింకులు పంపాలని మోసాలు చేస్తున్నారన్నారు. ఆఫర్లు ప్రకటించి డబ్బులు కొట్టేసేందుకు సైబర్ మాయగాళ్ళు ఏ చిన్న అవకాశాన్ని కూడా వదులుకోవడం లేదని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. తక్కువ ధరకే కారులు, సెల్ ఫోన్లు, వస్తువులు, గడియారాలు అంటూ ఆకట్టుకునేలా ప్రకటనలు ఇస్తారు. ఆశపడి లింక్ క్లిక్ చేస్తే ఇక అంతే సంగతులు. ఇదంతా మోసం అని తెలుసుకునే లోపే ఖాతాలోని నగదు మాయం అవుతుందన్నారు. ప్రముఖ కంపెనీలకు చెందిన లోగోలను వాటి మాదిరిగానే తయారుచేసి ఫేస్ బుక్ , ఇన్స్టాగ్రామ్, వాట్సాప్ లాంటి సోషల్ మీడియాలో లింకులు పంపిస్తారన్నారు. మార్కెట్ ధర కంటే 50 నుంచి 75 శాతం వరకు తగ్గింపు ఇస్తామంటూ వల వేస్తారన్నారు. భారీ డిస్కౌంట్ ఇస్తామని చెప్పి ప్రచారం చేస్తారన్నారు. ఇన్స్టాగ్రామ్ చూస్తుండగా అకస్మాత్తుగా ఓ ప్రకటన కనిపిస్తుంది. అందులో రూ. 1500 కే ఐఫోన్ అంటూ కింద టైం నడుస్తూ ఉంటుంది. మరికొద్ది సేపట్లో ఈ ఆఫర్ ముగుస్తుందని, రాసి ఉండడంతో ఆలోచించుకునే సమయం కూడా ఇవ్వరు, బ్యాంక్ ఖాతా వివరాలు నమోదు చేస్తే మోసపోతారని హెచ్చరించారు.

ఇలా మోసగిస్తారు... జాగ్రత్త: పత్తికొండ, కర్నూలు జిల్లాకు చెందిన వ్యక్తికి వాట్సాప్‌లో దసరా బిగ్ సేల్ %-% మీరు కారు గెలిచారు, క్లైమ్ చేసుకోవడానికి క్లిక్ చేయండి" అనే లింక్ వచ్చింది. ఆయన నమ్మి లింక్ క్లిక్ చేసి, డిటైల్స్ ఇచ్చాడు. తర్వాత 10 నిమిషాల్లోనే అతని బ్యాంక్ ఖాతా నుండి రూ.25 వేలు డెబిట్ అయ్యింది. కోడుమూరుకు చెందిన ఒక వ్యక్తి కి ఇన్‌స్టాగ్రామ్ స్క్రోల్ చేస్తుండగా ఐఫోన్ కేవలం రూ1,500కే... ఆఫర్ ఇంకో 5 నిమిషాల వరకే" అని ప్రకటన వచ్చింది. తొందరగా ఆఫర్ మిస్ కాకూడదని తన యూపీఐ ఐడీ ద్వారా చెల్లింపు చేసారు. తర్వాత ఫోన్ రాలేదు, డబ్బులు కూడా తిరిగి రాలేదు. ఎమ్మిగనూరుకు చెందిన ఒక వ్యకి కి ఫేస్‌బుక్‌లో ఒక వెబ్‌సైట్ లింక్ చూసి, గడియారాలు 70 శాతం డిస్కౌంట్... బ్రాండెడ్ వాట్స్ కేవలం రూ. 999 అని ప్రకటన ఉంది. ఆ సైట్ ద్వారా కొనుగోలు చేసి ఆన్‌లైన్ చెల్లింపు చేశాడు. అయితే వస్తువు రాలేదు, వెబ్‌సైట్ కూడా తర్వాత కనిపించలేదు. ఆన్లైన్లో వివిధ కంపెనీలకు చెందిన వస్తువులను కొనుగోలు చేయాలనుకుంటే గూగుల్ ప్లే స్టోర్ నుండి మాత్రమే డౌన్లోడ్ చేసుకోవాలని జిల్లా ఎస్పీ సూచించారు. మార్కెట్ ధర కంటే చాలా తక్కువ ధరకు ఆన్లైన్లో వస్తువులు ఇస్తామంటే వాటిని నమ్మొద్దన్నారు. సోషల్ మీడియాలో లింకుల ద్వారా వచ్చే యాప్ లను ఎట్టి పరిస్థితుల్లోనూ డౌన్లోడ్ చేసుకోవద్దని చెప్పారు. ఒకవేళ సైబర్ మోసానికి గురైతే, వెంటనే సైబర్ క్రైమ్ 1930 హెల్ప్ లైన్ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ సూచించారు.

# ఈ సేవా కేంద్రాన్ని ప్రారంభించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి



మనగళం, కర్నూలు కార్పొరేషన్ : ఉన్నత న్యాయస్థానాల ఆదేశాల మేరకు న్యాయవాదులు, కక్షి దారుల సౌకర్యార్థం జిల్లా, మున్సిఫ్ కోర్ట్ ఆవరణాలలో ఏర్పాటు చేసిన ఈ సేవా కేంద్రాన్ని కర్నూల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్ధి ప్రారంభించారు. ఈ సేవా కేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు, కక్షి దారులు తదితరులు పాల్గొన్నారు.

# అక్టోబర్ 16 నుంచి చదరంగం పోటీలు







మనగళం, కర్నూలు సిటీ : దివంగత ఎంపీపీ డి. రాజవర్ధన్ రెడ్డి 48 వ జయంతి సందర్భంగా అంతర్జాతీయ ఓపెన్ రాపిడ్ అండ్ బ్లిట్జ్ ఫైడ్ రేటింగ్ చెస్ టోర్న మెంట్-2025 నిర్వహిస్తున్నట్లు టీడీపీ నాయకులు తెలిపారు. అంతర్జాతీయ చదరంగం పోటీలు కల్లూరు మండలం దుపాడు రైల్వే స్టేషన్ సమీపంలోని కెవి సుబ్బారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో అక్టోబర్ 16 నుంచి 17 వరకు టోర్నమెంట్ జరగనుందన్నారు. ఈ మేరకు శుక్రవారం టోర్నమెంట్ పోస్టర్లను మాజీ ఉపముఖ్య మంత్రి కేఈ కృష్ణమూర్తి, కర్నూలు జిల్లా టీడీపీ అధ్యక్షులు పాలకుర్తి తిక్కా రెడ్డి, కేడీసీసీబీ చైర్మన్ డి విష్ణువర్ధన్ రెడ్డి, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యామ్ బాబు తదితర నాయకులు విడుదల చేశారు.

# క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ తప్పనిసరి

- పట్టణ ప్రణాళిక విభాగ సిబ్బందితో కమిషనర్ పి. విశ్వనాథ్
- ఎల్ఆర్‌యస్‌పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలి
- అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు, చార్జిషీట్లు తప్పనిసరి



మనగళం, కర్నూలు కార్పొరేషన్ : నగరంలో పట్టణ ప్రణాళిక విభాగ అధికారులు, ప్లానింగ్ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని నగరపాలక కమిషనర్ పి. విశ్వనాథ్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఎస్బీఐ ఎంప్లాయీస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో "ఓపెన్ ఫోరం" కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. దీర్ఘకాలంగా పరిష్కారం కాని సమస్యలను పరిష్కరించేందుకు, సమన్వయ లోపం వల్ల జాప్యం జరగకుండా, ప్రజలు తిరగాల్సిన అవసరం లేకుండా తక్షణ సేవలు అందించడానికి ప్రతి శుక్రవారం "ఓపెన్ ఫోరం" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ప్లానింగ్ కార్యదర్శులను ఉద్దేశించి కమిషనర్ మాట్లాడుతూ ఎల్ఆర్‌యస్ పథకంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ప్లానింగ్ కార్యదర్శి తన సచివాలయ పరిధిలో ప్రతిరోజూ పర్యటించి అక్రమ నిర్మాణాలను గుర్తించి, చార్జిషీట్లు దాఖలు చేయాలని పేర్కొన్నారు. అనధికారిక లేఅవుట్లను ఎల్ఆర్‌యస్ పథకం ద్వారా క్రమబద్ధీకరించాలని సూచించారు. సీ అండ్ డీ వేస్ట్ మేనేజ్మెంట్‌ను సమర్థవంతంగా నిర్వహించి, నిర్మాణదారులకు తగిన అవగాహన కల్పించాలని ఆదేశించారు. అదేవిధంగా ఎల్‌టీపీలతో కూడా కమిషనర్ చర్చించారు. ప్లానింగ్ కార్యదర్శులతో సమన్వయాన్ని బలోపేతం చేయడం, ఎదురయ్యే సమస్యలను తక్షణమే పరిష్కరించడం పై దృష్టి సారించారు. ఓపెన్ ఫోరంలో వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్.జి.వి. కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, డీసీపీ వెంకట రమణ, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

# నేపాల్ నుంచి తెలుగువారిని రక్షించడంలో లోకేష్ పాత్ర అపూర్వం



మనగళం, కర్నూలు సిటీ : నేపాల్‌లో జరుగుతున్న అల్లర్ల కారణంగా చిక్కుకుపోయిన తెలుగు ప్రజలను సురక్షితంగా స్వస్థలాలకు రప్పించడంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి నారా లోకేష్ పాత్ర అపూర్వమని కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేపాల్‌లో జరుగుతున్న మారణహోమంలో తెలుగువారు ఉన్నారని తెలిసిన వెంటనే లోకేష్ ఒక్క క్షణం ఆలస్యం చేయకుండా స్పందించి, అనంతపురం పర్యటనను రద్దు చేసుకుని నేరుగా అమరావతిలోని సచివాలయానికి చేరుకున్నారన్నారు. రియల్టైమ్ గవర్నెన్స్ సెంటర్‌ను వార్ రూమ్ గా మార్చి సహాయక చర్యలను సమన్వయం చేసిన లోకేష్, బాధితులతో నేరుగా మాట్లాడి ధైర్యం చెప్పారని గుర్తు చేశారు. ఎక్కడ చిక్కుకుపోయారో వారి లొకేషన్ కోఆర్డినేట్లు, మ్యాప్‌లు సిద్ధం చేయించి, ఢిల్లీలోని ఏపీ భవనంలో అత్యవసర హెల్ప్‌లైన్ ఏర్పాటు చేశారన్నారు. ఆహారం, నీరు, వసతి సదుపాయాలను కల్పించేలా కృషి చేశారని గుర్తు చేశారు. ఈ చర్యలతో మానవతా విలువలను నిలబెట్టిన లోకేష్, కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేస్తూ 215 మంది తెలుగువారిని సురక్షితంగా రక్షించడంలో కీలకపాత్ర పోషించారని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఎప్పుడైనా తెలుగువారికి అపద కలిగితే ముందుండి సాయం చేసే పార్టీ టీడీపీ అని మరోసారి నిరూపించారన్నారు. అయితే ఈ సున్నితమైన అంశంలోనూ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నుంచి మాత్రం కనీస స్పందన కూడా రాలేదన్నారు. మానవతా దృక్పథంతో వ్యవహరించాల్సిన సందర్భంలో నిర్లక్ష్యం ప్రదర్శించారని ఆరోపించారు. గతంలో ఉత్తరాఖండ్ వరదల్లో చిక్కుకున్న వారిని, గల్ఫ్ దేశాల్లో ఇబ్బందులు పడిన వారిని స్వదేశానికి రప్పించడంలోనూ చంద్రబాబు నాయుడు కీలకపాత్ర పోషించారని, ఇప్పుడు అదే సంప్రదాయాన్ని లోకేష్ కొనసాగించారని సోమిశెట్టి పేర్కొన్నారు.

# ద్విచక్ర వాహనాలు దొంగలించే నిందితుడు అరెస్టు

- రూ. 16 లక్షల విలువ చేసే 32 వాహనాలు స్వాధీనం







మనగళం, కర్నూలు క్రైం : ద్విచక్ర వాహనాలు దొంగలించిన నిందితున్ని కర్నూలు రెండవ పట్టణ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఈ మేరకు కర్నూలు టు టౌన్ సీఐ నాగరాజారావు, ఎస్సైలు సతీష్, మల్లికార్జున తో కలిసి కర్నూలు రెండవ పట్టణ పోలీసుస్టేషన్ లో నిందితుని వివరాలను కర్నూలు డీఎస్పీ జె. బాబు ప్రసాద్ వెల్లడించారు. కర్నూలు పట్టణంలోని భూపాల్ కాంప్లెక్స్ దగ్గర ఒక బైక్ దొంగలించారని కర్నూలు, లక్ష్మీనగర్ కు చెందిన నిరంజన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారన్నారు. కర్నూలు టు టౌన్ సీఐ , ఎస్సైలు, పోలీసు కానిస్టేబుల్స్ రవి కుమార్, శ్రీనివాసులు, మహేంద్ర కలిసి ఒక స్పెషల్ టీమ్ గా ఏర్పడి నిందితున్ని పట్టుకోవడాని చర్యలు చేపట్టారన్నారు. రాబడిన సమాచారం మేరకు కర్నూలు- సుంకేశుల రోడ్డు లో ఉన్న రెండు వాగుల వద్ద ఈ రోజు తెలంగాణ రాష్ట్రం, గద్వాల పట్టణం, దౌడురాళ్ళ కాలనీకి చెందిన తెలుగు జయంత్ ను అరెస్టు చేశారన్నారు. అతని నుండి 32 బైక్ (హొండాషైన్ , హిరో హొండా, యూనికార్న్ ) లను రికవరీ చేయడం జరిగిందన్నారు. కర్నూలు, మహబూబ్ నగర్ జిల్లాలలో బైక్ లను దొంగలించినట్లు విచారణంలో తేలిందన్నారు. వీటి విలువ రూ. 16 లక్షల వరకు ఉంటుందన్నారు. ఆయా పోలీసుస్టేషన్ లకు రికవరి చేసిన బైక్ ల గురించిన సమాచారం అందిస్తామన్నారు. వాహనం ఇంజిన్ నెంబర్, బైక్ చాస్ నెంబర్ ద్వారా సంబధించిన బైక్ యజమానులకు అప్పగిస్తామన్నారు. కర్నూలు టౌన్ లోని పలు జంక్షన్స్ , హాస్పిటల్స్ , రాత్రి ఇళ్ళ దగ్గర పార్కింగ్ చేసిన బైక్ లను నిందితుడు దొంగలించినట్లు గుర్తించామన్నారు. కర్నూలు టు టౌన్ సీఐతోపాటు టు టౌన్ సిబ్బందిని ఈ సందర్భంగా డీఎస్పీ అభినందించారు.

# కర్నూలు జిల్లాకు దామోదరం సంజీవయ్య పేరు పెట్టాలి




మనగళం, కర్నూలు సిటీ : కర్నూలు జిల్లాకు దామోదరం సంజీవయ్య పేరు పెట్టాలని కోరుతూ అభ్యుదయ దళిత సేవా సంఘం నాయకులు శుక్రవారం టీడీపీ కార్యాలయంలో నాయకులు, ప్రజా ప్రతినిధులకు వినతి పత్రం అందజేశారు. టీడీపీ అధ్యక్షులు పాలకుర్తి తిక్కరెడ్డి, కర్నూలు పార్లమెంట్ సభ్యులు బస్తిపాటి నాగరాజు, పత్తికొండ, కోడుమూరు ఎమ్మెల్యేలు కేఈ శ్యామ్ కుమార్, బొగ్గుల దస్తగిరి, కేడీసీసీబీ చైర్మన్ డి.విష్ణువర్ధన్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో అభ్యుదయ దళిత సేవా సంఘం నాయకులు కల్లుపోతుల రంగన్న, జి.ఆంజనేయులు, నీలకంట, కుంకనూరు వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

యూరియా కొరత పాలకుల సృష్టి!

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో యూరియా కొరత వల్ల రైతాంగం తీవ్ర అవస్థలు పడుతున్నారు. సేద్యానికి యూరియా కీలకంగా మారింది. పైరు ఎదుగుదలకు యూరియా తప్పనిసరిగా వేయాలి. రెండు రాష్ట్రాల్లో ఖరీఫ్ సేద్యం చివరి దశకు వచ్చింది ప్రారంభంలోనే పొలంపై యూరియా చల్లాలి. రైతులు ప్రాథమిక పరపతి సంఘాలకు, ఎరువుల షాపులకు వెళ్తే యూరియా లేదనే మాట వస్తున్నది. దాంతో రైతాంగం తీవ్ర ఆందోళనకు గురయ్యారు. సకాలంలో యూరియా చల్లకపోతే దిగుబడి తగ్గుతుందని ఆందోళన చెందుతున్నారు. యూరియా కోసం తెలంగాణ రైతాంగం రెండు నెలలుగా ఆందోళన చేస్తున్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పిఎసిఎస్)వద్ద, ఎరువుల దుకాణాల వద్ద పడిగాపులు పడుతున్నారు. పనులు మానుకుని వర్షానికి, ఎండలకు తట్టుకుని క్యూ లైన్లలో నిలబడుతున్నారు. గంటల తరబడి నిలబడ లేక వరుసలో చెప్పులుపెట్టి సేద తీరుతున్నారు. తెలంగాణ కోటి 32 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నట్లు ఆ రాష్ట్ర వ్యవసాయ శాఖ అంచనాగా ఉంది. అందులో 62.46 లక్షల ఎకరాల్లో వరి సేద్యం చేస్తున్నారు. 48.93 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నారు. కంది 6.69 లక్షల, మొక్కజొన్న 5.21 లక్షల ఎకరాల్లో రైతు సేద్యం ఉంది. ఈ ఖరీఫ్ సేద్యానికి 9.80 లక్షల టన్నుల యూరియా అవసరమని రాష్ట్ర వ్యవసాయ శాఖ అంచనా వేసింది. కేంద్ర 9.8 లక్షల యూరియా కేటాయించింది. 2025 ఆగస్టు నాటికి కేంద్రం నుంచి 8.32 లక్షల టన్నుల యూరియా రావాల్సి ఉండగా, 5.12 లక్షల టన్నులు మాత్రమే వచ్చింది. కేంద్రం నుంచి ఏప్రిల్ 1.70 లక్షల టన్నులు, మే 1.60 లక్షలు, జూన్‌లో 1.70 లక్షలు, జులైలో 1.60 లక్షలు, ఆగస్టులో 1.70 లక్షల టన్నులు మాత్రమే వచ్చింది. రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ నుండి రాష్ట్రానికి అత్యధిక శాతం యూరియా రావాల్సి ఉంది. సాంకేతిక కారణాలు, రిపేర్లతో మూడు సార్లు షట్‌డౌన్ అయింది. దీంతో ఆగస్టు వరకు 1.69 లక్షల టన్నుల యూరియా రావాల్సి ఉండగా, 1.06 లక్షల టన్నులు మాత్రమే సరఫరా అయ్యింది. రామగుండం ఫ్యాక్టరీ సక్రమంగా పనిచేయక పోవటానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే కారణం. రెండు ప్రభుత్వాలు ఫ్యాక్టరీని పట్టించుకోలేదు. యూరియా కొరత తీవ్రమైన తర్వాత మాత్రమే రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు.

తెలంగాణలో ఎక్కువగా దొడ్డ యూరియాను రైతులు వినియోగిస్తారు. దొడ్డ యూరియాను ఎప్పుడూ అధికారులు ప్రత్యేక కేటాయింపులు చేయలేదు. నేడు పిఎసి ఎస్ (ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు) లకే కాకుండా ఇతర సంస్థలకు కూడా కేటాయిస్తున్నారు. జిల్లాలకు వచ్చే యూరియాలో 60% పిఎసి ఎస్‌లకు, 40% ఆయా కంపెనీల ఏజన్సీలు కలిగిన ప్రైవేట్ సంస్థలకూ కేటాయిస్తున్నారు. ఫలితంగా పిఎసిఎస్ లకు రావాల్సిన యూరియా తగ్గి రైతులకు సరిపోను యూరియా లభించటం లేదు. అగ్రి రైతు సేవా కేంద్రం, ఎన్‌డిసిఎం ఎస్ (డిస్ట్రిక్ కస్టమర్ మేనేజ్ మెంట్ సిస్టమ్) ఫార్మర్ ప్రొక్యూర్‌మెంట్ ఆర్గనైజేషన్‌లలో యూరియా కొనుగోలుతోపాటు ఇతర పురుగు మందులను లింక్ పెట్టి విక్రయిస్తున్నారు. ఇది రైతుకు అదనపు ఆర్థిక భారంగా మారింది. ప్రతి సారి కంటెయినర్ రాగానే ఒక్కో షాపు నుంచి 15 నుంచి 20 వేలు తీసుకుని వారికే అధికారులు కేటాయిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 2025 ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటి వరకు 8.21 లక్షల ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేశారు. 6.22 లక్షల టన్నుల యూరియాను కేంద్రం కేటాయించింది. గత సంవత్సరం కన్నా 10,138 టన్నుల తక్కువ. 2024 సంవత్సరంలో ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు 4,69,297 టన్నులు సరఫరా కాగా, ఈ సంవత్సరం 3,72,246 టన్నుల మాత్రమే కేంద్రం నుండి సరఫరా జరిగింది. తగ్గింపు 96 వేల టన్నులకు పైగా ఉంది. ఆగస్టుకి లక్షా 30 వేల టన్నుల యూరియా కేంద్రం సరఫరా చేయాల్సి ఉండగా, అందింది 49,485 టన్నులు మాత్రమే. తాజా 53 వేల మెట్రిక్ టన్నులు అదనంగా కేటాయించినట్లు కూటమి ప్రభుత్వ చెప్పటం దాని వంచనకు నిదర్శనం. ఆగస్టు నెల కోటాలో ఇంకా కేంద్రం నుంచి 81 వేల టన్నులు రావాల్సిన దానిలో 53 వేల టన్నులు కేంద్రం విడుదల చేసినా ఇంకా 28 వేల టన్నులు కేంద్రం నుంచి రావాల్సి ఉంది. దీన్ని గమనిస్తే అదనంగా కేంద్రం యూరియా కేటాయింపు ఎక్కడ. 53 వేల కేటాయింపుల్లో కూడా కాకినాడ పోర్టు నుండి 17,293 టన్నులు దిగుమతి చేసుకోవటానికి మాత్రమే కేంద్రం జిఒ విడుదల చేసింది. మిగతా యూరియా విషయం కేంద్రం ప్రస్తావించలేదు. దేశవ్యాప్తంగా యూరియా కోత 10% ఉండగా, రాష్ట్రంలో 25%గా ఉంది. ఈ వాస్తవాన్ని కూటమి ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా మరుగుపరుస్తున్నది. సెప్టెంబర్ 9 నాటికి 22 జిల్లాల్లో యూరియా కొరత ఏర్పడింది. ఎన్‌డిఎ ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా ఉండి కూడా రాష్ట్రానికి కావాల్సిన యూరియాను కేంద్రంనుంచి తెచ్చుకోలేకపోవటం చంద్రబాబు కూటమి ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనం. యూరియా కొరతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే కారణం. దేశపాలకులు అధికారం చేపట్టి 78 సంవత్సరాలైనా వ్యవసాయ అవసరాలకు సరిపోను యూరియా ఉత్పత్తి చేయడంలో విఫలమయ్యారు. దేశంలో 32 యూనిట్లలో యూరియా ఉత్పత్తి జరుగుతున్నది. 2023- 24లో 283 మిలియన్ టన్నుల ఉత్పత్తి జరిగింది. ఇది దేశ అవసరాలకు సరిపోక లక్షల టన్నుల యూరియా దిగుమతి చేసుకుంటున్నాము. 2021 -22లో 6.52 మిలియన్ డాలర్ల విలువైన 10.16 మిలియన్ టన్నుల యూరియా దిగుమతి అయ్యింది. 2022- 23లో 10 మిలియన్ టన్నులు, 2023 -24లో 7 మిలియన్ టన్నుల యూరియా మోడీ ప్రభుత్వం దిగుమతి చేసుకుంది. ప్రధానంగా చైనా, సౌదీ అరేబియా, ఒమన్, ఈజిప్టు, ఉక్రెయిన్, ఖతార్ నుండి దిగుమతి జరుగుతున్నది. యూరియా సబ్సిడీని తగ్గించుకునేందుకు మోడీ ప్రభుత్వం యూరియాను 10% తగ్గుదలను సృష్టించింది. ఈ సంవత్సరం చైనా నుండి యూరియా దిగుమతి జరగలేదు. వ్యవసాయ శాఖ నివేదిక ప్రకారం ఆగస్టు 1,2025 నాటికి దేశంలో 37.19లక్షల టన్నుల యూరియా నిల్వఉంది. గత సంవత్సరం కన్నా 49.24 లక్షల టన్నులు తక్కువ. ఉత్పత్తి, నిల్వతగ్గటంతో రాష్ట్రాలకు ఇవ్వాల్సిన కేటాయింపుల్లో మోడీ ప్రభుత్వం తగ్గింపులు చేస్తున్నది. దాని ఫలితమే తెలుగు రాష్ట్రాల్లో యూరియా కొరత. యూరియా కొరతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలే కారణమని రైతాంగం గ్రహించి, రైతులకు కావాల్సిన యూరియా తక్షణమే సప్లయ్ చేయాలని, కొత్త యూరియా యూనిట్లను నెలకొల్పి యూరియా ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించాలని, ప్రైవేట్ సంస్థలకు యూరియా కేటాయింపులు చేయరాదని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా తెలుగు రాష్ట్రాల ప్రజలు ఉద్యమ బాటపట్టాలి.

## 13,14 తేదీలలో గ్రామీణ విలేకరులకు పునశ్చరణ తరగతులు

మనగళం, ప్రత్యేక ప్రతినిధి : కర్నూలు జిల్లా గ్రామీణ విలేకరులకు సెప్టెంబర్ నెల 13,14 తేదీలలో పునశ్చరణ తరగతులు నిర్వహిస్తున్నామని సీఆర్. మీడియా అకాడమి చైర్మన్ ఆలపాటి సురేశ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పునశ్చరణ తరగతులు మౌర్య ఇన్ పరిణయ ఫంక్షన్ హాల్ లో ఉంటాయన్నారు. శనివారం ఉదయం 10 గంటలకు సభ ఉంటుందని, అనంతరం తరగతులు ప్రారంభం అవుతాయన్నారు. తొలి రోజు "ఎలక్ట్రానిక్ మీడియా రిపోర్టింగ్‌బీ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ)బీ క్రైమ్ రిపోర్టింగ్" అంశాలపైన తరగతులు ఉంటాయన్నారు. రెండవరోజు గ్రామీణ వార్తలు, కథనాలు, పత్రికా భాష, ఫ్యూచర్ రైటింగ్, విలేకరుల నుంచి డెస్క్ ఏం కోరుకుంటుంది - డెస్క్ కోఆర్డినేషన్" అంశాలపై సీనియర్ జర్నలిస్టులు శిక్షణ ఇస్తారని చైర్మన్ తెలియజేశారు. ఈ పునశ్చరణ తరగతులను కర్నూలు జిల్లా గ్రామీణ విలేకరులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



మనగళం, కల్లూరు : ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక మాధవి నగర్ లోని తన క్యాంప్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా పాణ్యం నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఎమ్మెల్యే వినతులు స్వీకరించారు. కొన్నింటికి వెంటనే అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడి అక్కడికక్కడే సమస్యలను పరిష్కరించారు. ప్రజల వినతులపై ప్రత్యేక దృష్టి సారించి, నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా గౌరు అధికారులకు సూచించారు.

## అవినీతి అధికారులపై చర్యలు

మనగళం, కర్నూలు కలెక్టరేట్ : అవినీతికి పాల్పడిన ప్రభుత్వ అధికారులపై లోకాయుక్త చర్యలు చేపట్టింది. వివరాలు ఇలా ఉన్నాయి. గతంలో కల్లూరు మండలం తహసీల్దార్ గా విధులు నిర్వర్తించిన టి. అంజనా దేవి, లక్ష్మిపురం గ్రామ రెవెన్యూ అధికారి కె.ఎల్.వరప్రసాదరావు అక్రమాలకు పాల్పడినట్లు వి.మురళీధర్ రెడ్డి అనే వ్యక్తి లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. అప్పటి తహసీల్దార్ అంజనాదేవి రూ.4 లక్షలు లంచం తీసుకొని దుపాడు గ్రామంలోని సర్వే నెం.15/4లో కొంతమందికి చట్టవిరుద్ధంగా నకిలీ ఇంటి స్థల పట్టాలను జారీ చేశారని ఆరోపిస్తూ వి.మురళీధర్ రెడ్డి ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈమేరకు ఫిర్యాదును స్వీకరించిన లోకాయుక్త పి.రజని విచారణ జరిపించారు. లోకాయుక్త ఆదేశాల మేరకు కర్నూలు జాయింట్ కలెక్టర్ విచారణ చేశారు. ఈ మేరకు అప్పటి తహసీల్దార్ టి.అంజనా దేవి, వీ.ఆర్.ఓ. కేఎల్ వరప్రసాదరావులపై క్రమ శిక్షణా చర్యలు చేపట్టారు. టి.అంజనా దేవికి సంవత్సరం పాటు వేతన శ్రేణి తగ్గింపు, (పెన్షన్పై ప్రభావం లేకుండా), కే.ఎల్ వరప్రసాదరావుకు రెండు వార్షిక వేతన ఇంక్రిమెంట్లు నిలిపివేశారు. ప్రభుత్వం తీసుకున్న క్రమశిక్షణా చర్యల దృష్ట్యా, ఉప లోకాయుక్త ఫిర్యాదు నెం.795/2021/బి1 ను మూసివేయడం జరిగింది. లోకాయుక్త పౌరుల ఫిర్యాదులను పరిష్కరించడంలో, ప్రజాపరిపాలనలో జవాబుదారీతనాన్ని నిర్ధారించడంలో నిబద్ధతను పునరుద్ఘాటిస్తుందని ఈ కేసు ద్వారా మరోమారు రుజువైంది.

## పెద్ద హరివాణం గ్రామాన్ని మండలంగా ఏర్పాటు చేయాలి

- ఎంపీ బస్తిపాటి నాగరాజుకు గ్రామస్తుల వినతి




మనగళం, ఆదోని : ఆదోని జిల్లా తో పాటు, ఆదోని మండలంలోని పెద్ద హరివాణం గ్రామాన్ని మండలంగా ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని హరివాణం గ్రామస్తులు ఎంపీ బస్తిపాటి నాగరాజును కోరారు. ఈ మేరకు నగరంలోని ఎంపీ కార్యాలయంలో ఆయనను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మండల ఏర్పాటు పై చర్చించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ ఆదోని జిల్లా తో పాటు, హరివాణాన్ని మండలం కేంద్రంగా ఏర్పాటు కు కృషి చేస్తానన్నారు. కమిటీ ముందు తన అభిప్రాయాన్ని బలంగా వినిపిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ ఆదినారాయణ రెడ్డి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## టీడీపీ కార్యకర్త మృతి



మనగళం, కల్లూరు : కల్లూరు అర్బన్ పరిధిలోని 41 వ వార్డ్ కి చెందిన టీడీపీ కార్యకర్త మద్దిలేటి మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఉమ్మడి కర్నూలు జిల్లా టీడీపీ సీనియర్ నేత, నందికొట్కూరు నియోజకవర్గం టీడీపీ ఇన్చార్జి గౌరు వెంకట రెడ్డి మద్దిలేటి మృత దేహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. కుటుంబ సభ్యును ఓదార్చిన గౌరు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

## పర్యావరణ పరిరక్షణతోనే మెరుగైన భవిష్యత్తు




మనగళం, కల్లూరు : పర్యావరణ పరిరక్షణతోనే మెరుగైన భవిష్యత్తు సాకారమౌతుందని కర్నూలు జిల్లా ఉల్లిందకొండ జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు ఎం.లీలావతి పేర్కొన్నారు. భారత ప్రభుత్వ సమాచార ప్రసార మంత్రిత్వశాఖ పరిధిలోని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్, కర్నూలు ఆధ్వర్యంలో పాఠశాలలో ఏక్ పేడ్ మా కే నామ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు, ఉపాధ్యాయులు తమ అమ్మ పేరిట మొక్కలను నాటారు. అనంతరం పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మురళీధర్, జ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు.

## బనగానపల్లెలో మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి సుడిగాలి పర్యటన..







మన గళం బనగానపల్లె : ఈ రోజు ఉదయం బనగానపల్లె పట్టణంలో పలు వీధుల్లో విస్తృతంగా పర్యటించి, పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను పర్యవేక్షించిన రాష్ట్ర రోడ్లు మరియు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి.. బనగానపల్లెలోని కర్ణముద్దీన్ కాలనీలో రూ. 68 లక్షలతో చేపట్టిన సీసీ రహదారులు సీసీ డ్రైన్ల అభివృద్ధి పనులను అధికారులతో కలిసి పరిశీలించిన మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి.. కరీం బాగ్ వీధిలో 60 లక్షలు ఖాజీవాడ, టాకీస్ వీధిలో రూ. 70 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్లు డ్రైన్ల అభివృద్ధి పనులను పరిశీలించిన మంత్రి ఈ సందర్భంగా అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో పాటు, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి పలు సూచనలు, సలహాలు చేసిన మంత్రి అదే సమయంలో పట్టణంలో నూతనంగా కరెంటు పోల్స్ ఏర్పాటు చేస్తున్న క్రమంలో.. రోడ్లపై అడ్డుగా ఉన్న పాత కరెంట్ పోల్స్ ను తొలగించాలని విద్యుత్ శాఖ అధికారులకు మంత్రి ఆదేశం పెద్దపీర్ల చావిడి, మంగళవారం పేటలో రూ. 75 లక్షలతో చేపట్టిన సీసీ రహదారులు డ్రైన్ల నిర్మాణ పరిశీలించిన అనంతరం.. స్థానికంగా పెద్ద పీర్ల చావిడి పరిధిలో అంగన్వాడి కేంద్రం భవన నిర్మాణంకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు మంత్రి ఆదేశం.. ఈ పర్యటనలో భాగంగా పట్టణంలోని స్థానిక మహిళలు ఆయా సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురాగా సానుకూలంగా స్పందించిన మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి స్థానికంగా పట్టణంలో పలుచోట్ల చెత్తచెదారంతో వీధులు అపరిశుభ్రంగా ఉండటంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసిన మంత్రి వర్షాకాలం సీజన్ నేపథ్యంలో, వైరల్ ఫీవర్లు, డయారేయా, అంటు వ్యాధులు ప్రబలకుండా, పరిసరాలను శుభ్రంగా ఉంచాలని మంత్రి ఆదేశం పట్టణంలోని కర్ణముద్దీన్ వీధిలో ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్ ను పరిశీలించిగా.. వాటర్ ప్లాంట్ మరమ్మతుపై మంత్రి దృష్టికి ప్రజలు, తీసుకురాగా, త్వరలోనే వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన మంత్రి

## ప్రభుత్వ భూములను పరిశీలించిన జేసీ విష్ణు చరణ్



మనగళం, గడివేముల : నంద్యాల జిల్లా, గడివేములు, మిడ్తూరు మండలాలలో ప్రభుత్వ భూములను శుక్రవారం జిల్లా జాయింట్ కలెక్టర్ సి విష్ణు చరణ్ పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ రెవెన్యూ అధికారులతో మాట్లాడారు. భూముల వివరాలపై ఆరా తీశారు. గ్రీన్ కో సంస్థ సోలార్ ప్రాజెక్టు ఏర్పాటు చేసేందుకు భూమి కావాలని కోరడం జరిగిందన్నారు. ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి గడివేముల మండలంలోని చనకపల్లి గ్రామం, మిడ్తూరు మండలాలలోని నాగలూటి గ్రామాలలో దాదాపు 200 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆర్డీఓ, తహసీల్దార్లతో కలిసి జేసీ పరిశీలించారు. ఈ భూములకు సంబంధించి సర్వే నెంబర్ల వారీగా జాయింట్ కలెక్టర్ మ్యాపులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు, సర్వేయర్లు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సి.బెళగల్ మండలంలోని మారం దొడ్డి గ్రామంలో బోయ నాగభూషణం మరణం వైసీపీ శ్రేణులు అశ్రునివాళి

మన గళం కోడుమూరు: కోడుమూరు నియోజకవర్గం లోని సి బెళగల్ మండల లో మారం దొడ్డి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మారం దొడ్డి గ్రామంలో రుక్మానంద్ తండ్రి బోయ నాగభూషణం అనారోగ్యం తో మరణించారు అని సి బెళగల్ మండల కన్వీనర్ సోమశేఖర్ రెడ్డి ద్వారా సమాచారం రావడంతో గ్రామానికి చేరుకొన మాజీ కుడా చైర్మన్ కోడుమూరు నియోజకవర్గ సమన్వయకర్త కోట్ల హర్షవర్ధన్ రెడ్డి కోడుమూరు నియోజవర్గ వైయస్సార్సీపి ఇంచార్జి డాక్టర్ ఆదిమూలపు సతీష్ నాగభూషణం పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ అన్ని విధాలుగా కుటుంబానికి అండగా ఉంటామని వారు అన్నారు. వారితోపాటు అధికార ప్రతినిధి ప్రభాకర్ రెడ్డి, మండల కన్వీనర్ సోమశేఖర్ రెడ్డి, కోడుమూరు నియోజవర్గం రైతు విభాగం అధ్యక్షులు నరసింహులు, యువజన విభాగం జిల్లా నాయకులు పులి రాజు,



సి బెళగల్ గ్రామ సర్పంచ్ పాండురంగన్న, సర్పంచ్ రాఘవేంద్ర, ఎంపిటిసి అంజి, బాయికాటి మద్దిలేటి, బాలరాజు, నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## కోడుమూరు నియోజకవర్గం ఎమ్మెల్యే శ్రీ బొగ్గుల దస్తగిరి తమ స్వగృహం నందు గ్రీవెన్స్ ప్రోగ్రాం

మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరు నియోజకవర్గ బొగ్గుల దస్తగిరి స్వగ్రామమైన పసుపుల గ్రామంలో తమ స్వగృహం నందు గ్రీవెన్స్ ప్రోగ్రాం చేపట్టారు వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలు, అభ్యర్థనలు ఎమ్మెల్యేకు నేరుగా తెలియజేశారు ప్రతి ఒక్కరి ఫిర్యాదును శ్రద్ధగా విని, వెంటనే సంబంధిత అధికారులకు పరిష్కార చర్యలు తీసుకోవాలని సూచించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలతో నిత్యం మమేకమై, ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, ప్రజల సమస్యలు పరిష్కరించడమే తన ధ్యేయమని అలాగే కూటమి ప్రభుత్వం ఎప్పుడు ప్రజలకు అండగా ఉంటుందని ఎటువంటి సమస్య వచ్చినా తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలను కోరారు ఇది ప్రజా ప్రభుత్వమని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల



ప్రజలు హాజరై తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం పొందారు

## బోయ గిరిని హత్య చేసిన కేసులో నిందితుడు పింజరి మౌలాలిని అరెస్టు చేసిన పోలీసులు




మన గళం కోడుమూరు: కోడుమూరు మండల కేంద్రంలో ఈనెల 6న మద్యం మత్తులో వెంకటగిరి గ్రామానికి చెందిన బోయ గిరిని హత్య చేసిన కేసులో నిందితుడు పింజరి మౌలాలి ని పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సిఐ తబ్రేజ్ కేసుకు సంబంధించిన వివరాలను మీడియాకు వెల్లడించారు. కోడుమూరు పట్టణంలోని వెంకటగిరి గల వైన్ షాపు వద్ద వెంకటగిరి గ్రామానికి చెందిన బోయ గిరి అదే గ్రామానికి చెందిన పింజారి మౌలాలి మధ్య ఘర్షణ జరిగి కత్తితో పొడిచి చంపినట్లు తెలిపారు దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితున్ని శనివారం అరెస్టు చేసి పోలీసులు రిమాండ్ కు తరలించారు

## కోడుమూరు మోడల్ స్కూల్ విద్యార్థులపై తేనెటీగల దాడి

మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరు పట్టణంలోని మోడల్ స్కూల్ విద్యార్థులపై హఠాత్తుగా తేనెటీగల దాడి చేసి సుమారు 40 మంది విద్యార్థినీ, విద్యార్థులకు కుట్టాయి. భోజన విరామ సమయంలో కొందరు ఆకతాయిలు చెట్టు పైన ఉన్న తేనె పట్టుకు రాయి విసరడంతో ఈ ఘటన చోటు చేసుకుంది. దీంతో పాఠశాల ఆవరణంలో ఉన్న విద్యార్థిని విద్యార్థులకు తేనెటీగలు కుట్టాయి. విద్యార్థులు నొప్పితో కేకలు వేసుకుంటూ పరుగులు తీశారు. బాధితులను కోడుమూరు ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. 37 మంది విద్యార్థులు క్షేమంగా ఉన్నారు 3 విద్యార్థులకు స్వల్ప గాయాలు అయ్యాయి. వీరిలో 8 తరగతి విద్యార్థి వెన్నల, 6 విద్యార్థి యువరాత్న, 8 తరగతి విద్యార్థి మురళి కి స్వల్ప గాయాలు అయ్యాయి. విద్యార్థులతో కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ఫోన్ ద్వారా మాట్లాడి వారిని పరామర్శించారు. అదేవిధంగా హాస్పిటల్ వైద్య అధికారితో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్ నాగరాజ్ ను కోరారు. ఎటువంటి ఆపాయం లేదనడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. కోడుమూరు మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి, ముడుమలగుర్తి సర్పంచ్ మల్లేష్ కోడుమూరు సీనియర్ నాయకులు



గోపాల్ నాయుడు, రవీంద్ర గౌడ్, బలరాం, మోడల్ స్కూల్ చైర్మన్ మధు, ప్రిన్సిపాల్ ఆశాజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## నేషనల్ ఛాంపియన్ షిఫ్ లో చిన్నారుల ప్రతిభ




మనగళం, బనగానపల్లె : హర్యానా రాష్ట్రంలోని కురుక్షేత్రలో కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా (కాయ్) ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ ఛాంపియన్ షిఫ్ – 2025 పోటీలో బనగానపల్లె జెన్ స్పోర్ట్స్ అండ్ ఆర్ట్స్ అకాడమీకి చెందిన చిన్నారుల అద్భుత ప్రతిభ కనబరిచారు. ఈ మేరకు శుక్రవారం బనగానపల్లె క్యాంపు కార్యాలయంలో మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డిని కరాటే పోటీ విజేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. హర్యానాలో జరిగిన కరాటే పోటీల్లో నాగ సాత్విక్ వెండి పతకం, బాలాజీ నాయక్ కాంస్య పతకం, సాయి చరణ్ తేజ కాంస్య పతకం, దివ్య కాంస్య పతకం సాధించడంతో వారిని మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి అభినందించారు.

## ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు మండల వ్యవసాయ అధికారి రవి ప్రకాష్





మన గళం కోడుమూరు:కోడుమూరు మండలంలోని ఎరువులు, పురుగుమందుల దుకాణదారులతో మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి రవి ప్రకాష్ వారితో మాట్లాడుతూ ప్రతి దుకాణంలో తప్పకుండా స్టాకు వివరాలు, ధరల పట్టికను బోర్డులో పొందుపరచాలని ఆదేశించారు. ఎటువంటి తేదీ అయిపోయినటువంటి కెమికల్స్ ని షాపులో ఉంచకూడదని, దుకాణంలో ఉన్నటువంటి సరుకు సంబంధించిన పత్రములు కచ్చితంగా ఉండవలెనని ఎరువులు కొనుగోలు చేసిన సమయంలో రైతులకు విధిగా బిల్లులు ఇవ్వాలని, వాటిపై రైతు సంతకము తీసుకోవాలని, రైతు అనుమతి లేకుండా ఇటువంటి లింకు ప్రోడక్ట్ ఇవ్వకూడదని ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయ అధికారి దుకాణాదారులను హెచ్చరించారు.

## సీతారాం ఏచూరి స్ఫూర్తితో మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాటం చేయాలి, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కెవి నారాయణ పిలుపు,







మన గళం గూడూరు: కర్నూలు జిల్లా కోడుమూరు నియోజకవర్గంలోని గూడూరు లోనీ సిఐటియు కార్యాలయంలో సిపిఎం పూర్వ జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి గారి మొదటి వర్ధంతి సభ సిపిఎం ప్రాంతీయ కమిటీ సభ్యులు జే,మోహన్ అధ్యక్షతన జరిగినది ఈ కార్యక్రమానికి సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.వి.నారాయణ ముఖ్యఅతిథిగా హాజరైనారు, ముందుగా కామ్రేడ్ సీతారాం ఏచూరి చిత్రపటానికి కేవీ నారాయణ పూలమాల వేసి నివాళు లర్పించడం జరిగింది ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు

కె.వి నారాయణ మాట్లాడుతూ కామ్రేడ్ సీతారాం ఏచూరి దేశంలో గొప్ప రాజకీయ నేత అని, ప్రపంచంలో గుర్తింపు పొందిన రాజకీయ నాయకుల్లో ఒకరిని, బహు భాషా కోవిదుడని, ఏచూరి చిన్ననాటి నుంచి అభ్యుదయ భావాలకు ప్రభావితమై విద్యార్థి సంఘాలో చేరి దేశంలోనే అత్యున్నత స్థాయి కలిగిన జవహర్లాల్ నెహ్రూ యూనివర్సిటీలో మూడుసార్లు ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడిగా ఎన్నికైన ఏకైక వ్యక్తి అని, యూనివర్సిటీలో విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ ఇంటికి వెళ్లి ఇంటి ముందు బైఠాయించి ఆమె బయటకు వచ్చి సమాధానం చెప్పే వరకు అక్కడే కూర్చున్న ఏకైక వ్యక్తి సీతారాం ఏచూరి అని ఈ సందర్భంగా పేర్కొన్నారు ఏచూరి పార్లమెంట్లో దేశంలోని ప్రజా సమస్యల పైన, కార్మికుల సమస్యల పైన నిత్యం చర్చించేవాడని, అందుకే ఆయనను పార్లమెంటరీ అవార్డు వచ్చిందని,, 2014 తర్వాత భారతదేశం అత్యంత ప్రమాదకర స్థితిలో ఉందని దానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వమే కారణమని తెలిపిన మొదటి వ్యక్తి సీతారాం ఏచూరి బిజెపి మతోన్మాదాన్ని ఎదుర్కోకపోతే భారతదేశం 50 ఏళ్ల వెనక్కి వెళ్తుందని సీతారాం ఏచూరి అన్నారని, బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయకుండా ప్రజలు వాటిని ప్రశ్నించకుండా ఉండడానికి మతం పేరుతో ప్రజలను చీల్చే ప్రయత్నం చేస్తుందనీ, ఆంధ్ర రాష్ట్రంలో నరేంద్ర మోడీకి ఊడిగం చేసే ప్రభుత్వాలు ఉండడం వల్ల ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు కూడా తీవ్ర నష్టం జరుగుతుందని, అందుకే సీతారాం ఏచూరి స్ఫూర్తితో దేశంలో పెరుగుతున్న మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాటాలు చేయడమే ఏచూరి నిజమైన నివాళులర్పించడం అవుతుందని ఆ రకంగా కార్యకర్తలందరూ ఆయన స్ఫూర్తితో పోరాటాల్లో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు,, కార్యక్రమంలో ప్రాంతీయ కమిటీ సభ్యులు రవి, కోటయ్య, రాజశేఖర్, పార్టీ సభ్యులు మద్దిలేటి, దానమన్న, మధు, శాంతన్న, హమాలి కార్మికులు పాల్గొన్నారు

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# ఊయల సేవ





మనగళం శ్రీశైలం : లోకకల్యాణం కోసం దేవస్థానం ఈ రోజు (12.09.2025) సాయంత్రం శ్రీస్వామిఅమ్మవార్లకు ఊయల సేవను నిర్వహించనున్నది. ప్రతి శుక్రవారం రోజు మరియు పౌర్ణమి, మూలానక్షత్రం రోజులలో ఈ ఊయలసేవ జరిపించబడుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు సేవా సంకల్పాన్ని పఠిస్తారు. తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ జరిపించబడుతుంది. అనంతరం ఊయలలో వేంచేబు చేయించిన శ్రీస్వామిఅమ్మవార్లకు శాస్త్రోక్తంగా షోడశోపచార పూజ జరిపించబడుతుంది. తరువాత చివరగా ఊయలసేవ నిర్వహించబడుతుంది. ఊయల సేవను పురస్కరించుకుని శ్రీస్వామిఅమ్మవార్లకు విశేషంగా పుష్పాలంకరణ, పుష్పార్చనలు జరిపించబడుతాయి.. పుష్పాలంకరణకు గాను పలుపుష్పాలు వినియోగించడం జరుగుతుంది.

# అంకాళమ్మ వారికి విశేష పూజలు



మనగళం శ్రీశైలం : లోకకల్యాణం కోసం శ్రీశైలక్షేత్ర గ్రామదేవత అయిన శ్రీ అంకాళమ్మవారికి ఈ రోజు (12,09,2025) ఉదయం అభిషేకం, విశేష పూజలను నిర్వహించడం జరిగింది. ప్రతీ శుక్రవారం రోజున శ్రీఅంకాళమ్మవారికి దేవస్థానంసేవగా (సర్కారిసేవగా) ఈ విశేషపూజ జరిపించబడుతోంది. ఇందులో భాగంగా శ్రీఅంకాళమ్మవారికి అభిషేకం, విశేష అర్చనలు, పుష్పాలంకరణ, కుంకుమార్చనలు జరిపించబడ్డాయి. కాగా శ్రీశైల క్షేత్రానికి గ్రామదేవతగా చెప్పబడుతున్న అంకాళమ్మ ఆలయం, ప్రధాన ఆలయానికి ఎదురుగాగల రహదారికి చివరలో కుడివైపున ఉత్తరముఖంగా ఉంది. ప్రకృతి శక్తుల యొక్క కళలే గ్రామ దేవతలని దేవీభాగవతంలో చెప్పబడింది. కాగా ఈ ప్రకృతి అంతా ఆదిపరాశక్తి స్వరూపమేనని మన ఆర్షవాఙ్మయం చెబుతోంది. చతుర్భుజాలను కలిగిన ఈ దేవి నాలుగు చేతులలో కుడివైపున క్రింది నుండి పైకి వరుసగా కత్తి, సర్పంలో చుట్టబడిన డమరుకం ఉండగా, ఎడమవైపున పానపాత్ర, త్రిశూలం ఉన్నాయి. కిరీట మకుటం గల ఈ దేవి వస్త్రాలంకురాలై కర్ణాభరణాలను, కంఠాభరణాలను కలిగి ఉంటుంది. కాగా కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతిపూజ జరిపించబడింది. ఆ తరువాత లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు సంకల్పాన్ని పఠించారు. అనంతరం పంచామృతాభిషేకం, హరిద్రోదకం, కుంకుమోదకం, గంధోదకం, పుష్పోదకం, జలముతో విశేష అభిషేకం అర్చనలు నిర్వహించబడ్డాయి.

# యూపీఐ పేమెంట్స్ లిమిట్ భారీగా పెంపు

మన గళం : భారత జాతీయ చెల్లింపు ల సంస్థ డిజిటల్ చెల్లింపుల వినియోగాన్ని మరింత పెంచేందుకు కీలక నిర్ణయాలు తీసుకుంది. సెప్టెంబర్ 15 నుంచి యూపీఐ వ్యవస్థలో కొత్త నిబంధనలు అమల్లోకి రానున్నాయి. వీటితో వినియోగదారులు పెద్ద మొత్తంలో కూడా సులభంగా లావాదేవీలు చేయగలుగుతున్నారు. ఇప్పటి వరకు అధిక మొత్తాల చెల్లింపుల కోసం వినియోగదారులు చెక్కులు లేదా నెట్ బ్యాంకింగ్‌పై ఆధారపడాల్సి వచ్చేది. కానీ కొత్త నిబంధనలతో ఈ ఇబ్బంది తగ్గనుంది. ధ్రువీకరించిన వ్యాపారులకు రోజుకు రూ.10 లక్షల వరకు చెల్లించవచ్చు. ఇది యూపీఐ వినియోగంలో ఒక విప్లవాత్మక మార్పు. వ్యక్తుల మధ్య నగదు బదిలీ పరిమితి మాత్రం యథాతథంగా ఉంది. రోజుకు రూ.1 లక్ష వరకు మాత్రమే పంపుకోవచ్చు. అంటే, కొత్త పరిమితులు కేవలం నిర్దిష్ట కేటగిరీల వ్యాపార లావాదేవీలకే వర్తిస్తాయి.

బీమా రంగంలో యూపీఐ వినియోగం పెరగనుంది. ఒక్కో లావాదేవీకి రూ.2 లక్షల పరిమితిని రూ.5 లక్షలకు పెంచారు. రోజుకు గరిష్టంగా రూ.10 లక్షలు చెల్లించే అవకాశం ఉంది. దీనితో పాలసీ హోల్డర్లకు మరింత సౌకర్యం కలగనుంది. బ్యాంక్ రుణాలు లేదా ఈఎంఐ చెల్లింపులకు కూడా యూపీఐ ద్వారా సౌలభ్యం ఏర్పడింది. ఒక్క లావాదేవీకి రూ.5 లక్షలు, రోజుకు రూ.10 లక్షల వరకు చెల్లించవచ్చు. పెద్ద మొత్తాల ఈఎంఐలు చెల్లించే వారికి ఇది ఒక మంచి నిర్ణయం. ప్రయాణ ఖర్చుల చెల్లింపులకు కూడా పరిమితి పెరిగింది. ఇప్పటి వరకు రూ.1 లక్ష ఉండగా, ఇప్పుడు రూ.5 లక్షలకు పెరిగింది. రోజుకు గరిష్టంగా రూ.10 లక్షలు వరకు చెల్లించవచ్చు. టూర్ ప్యాకేజీలు బుక్ చేసే వారికి ఇది ప్రయోజనం. క్రెడిట్ కార్డు బిల్లుల చెల్లింపులో యూపీఐ ఉపయోగం మరింత పెరగనుంది. ఒక్క లావాదేవీకి రూ.5 లక్షలు, రోజుకు రూ.6 లక్షలు వరకు చెల్లించవచ్చు. వినియోగదారులు ఇప్పుడు పెద్ద మొత్తాల బిల్లులు కూడా యూపీఐ ద్వారానే క్లియర్ చేయవచ్చు. నగల కొనుగోళ్లకు కూడా సౌకర్యం కల్పించారు. లావాదేవీ పరిమితి రూ.1 లక్ష నుంచి రూ.2 లక్షలకు పెరిగింది. రోజుకు రూ.6 లక్షల వరకు చెల్లించవచ్చు. నగల వ్యాపారులకు ఇది ఉపయోగకరంగా మారనుంది. +వవీ పోర్టల్‌లో పన్నులు, డిపాజిట్ల చెల్లింపుల పరిమితి కూడా పెరిగింది. ఇప్పటి వరకు రూ.1 లక్ష ఉండగా, ఇప్పుడు రూ.5 లక్షలకు పెరిగింది. దీంతో ప్రభుత్వ లావాదేవీలు డిజిటల్‌గా మరింత వేగవంతమవుతాయి. డిజిటల్ టర్మ్ డిపాజిట్ల కోసం కూడా పరిమితి పెంచారు. రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచడం ద్వారా కస్టమర్లకు అదనపు సౌకర్యం కలిగించనున్నారు. ఈ మార్పులు డిజిటల్ లావాదేవీల వినియోగాన్ని మరింత విస్తరించనున్నాయి. బీమా, రుణాలు, ప్రయాణాలు, నగల కొనుగోళ్లు, ప్రభుత్వ సేవలు వంటి విభాగాల్లో యూపీఐ వినియోగం పెరుగుతుందని ఎన్‌సీపీఐ నమ్ముతోంది. కొత్త నిబంధనలతో భారత డిజిటల్ ఆర్థిక వ్యవస్థ మరింత బలపడనుంది.

# ఆర్బీఐ భారీ భూకొనుగోలు - ముంబై రియల్ ఎస్టేట్‌లో సంచలనం




మన గళం : భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) రియల్ ఎస్టేట్ రంగంలో భారీ అడుగు వేసింది. ఇప్పటికే ముంబై మింట్ రోడ్‌లోని ప్రధాన కార్యాలయం, అనేక ఆస్తులు కలిగి ఉన్నప్పటికీ, ఇప్పుడు కొత్త ప్రదేశాన్ని సొంతం చేసుకోవడం చర్చనీయాంశమైంది. ఈ నిర్ణయంతో ఆర్బీఐ తన ఉనికిని మరింత బలోపేతం చేయాలని చూస్తోంది. ఆర్బీఐ ముంబై మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ నుంచి 4.61 ఎకరాల భూమిని కొనుగోలు చేసింది. ఈ కోసం ఏకంగా రూ.3,472 కోట్లు చెల్లించింది. ఈ మొత్తం ఈ ఏడాది రియల్ ఎస్టేట్ రంగంలో జరిగిన అతిపెద్ద భూమి కొనుగోలు విలువగా గుర్తించబడింది. వ్యాపార వర్గాల ప్రకారం, ఇప్పటివరకు ముంబైలో ఇంత భారీ రేటుతో భూమి కొనుగోలు జరగడం ఇదే మొదటిసారి. ఈ భూమి ముంబైలోని మంత్రాలయ, బాంబే హైకోర్టు, ప్రముఖ కార్పొరేట్ హెడ్‌క్వార్టర్స్‌కు సమీపంలో ఉంది. ఇది నారిమన్ పాయింట్ ప్రాంతానికి దగ్గరగా ఉండటం విశేషం. నారిమన్ పాయింట్ దేశంలోనే అత్యంత ఖరీదైన వ్యాపార కేంద్రంగా గుర్తింపు పొందింది. అక్కడ భూమిని సొంతం చేసుకోవడం దాదాపు అసాధ్యమేనని నిపుణులు చెబుతారు. అలాంటి ప్రదేశంలో ఆర్బీఐ కొత్తగా భూమిని కొనుగోలు చేయడం పెద్ద విజయంగా భావిస్తున్నారు. ఈ ఒప్పందం రియల్ ఎస్టేట్ రంగంలో హాట్ టాపిక్‌గా మారింది. భారీ మొత్తంలో జరిగిన ఈ డీల్ పెట్టుబడిదారులు, డెవలపర్లు, వ్యాపార వర్గాల్లో చర్చనీయాంశమైంది. నిపుణుల అంచనాల ప్రకారం, ఈ కొనుగోలు ముంబై రియల్ ఎస్టేట్ విలువలను మరింత పెంచే అవకాశం ఉంది. అంతేకాకుండా, భవిష్యత్‌లో ఇలాంటి ప్రీమియం ప్రదేశాల్లో ఆస్తుల ధరలు మరింత ఎగసిపడతాయని భావిస్తున్నారు. ఆర్బీఐ ఇప్పటికే అనేక ప్రధాన కేంద్రాల్లో ఆస్తులను కలిగి ఉన్నప్పటికీ, ముంబైలో మరో కీలక స్థలం సొంతం చేసుకోవడం వ్యూహాత్మకంగా చూస్తున్నారు. రాబోయే కాలంలో ఆర్థిక కార్యకలాపాలను విస్తరించడంలో, కొత్త అవసరాలను తీర్చడంలో ఈ ప్రాపర్టీ ఉపయుక్తంగా మారనుంది. ఈ భారీ కొనుగోలు దేశవ్యాప్తంగా కూడా చర్చనీయాంశమైంది. ఎందుకంటే, ఇంత పెద్ద స్థాయిలో భూమిని సొంతం చేసుకోవడం ఆర్బీఐ స్థిరమైన ఆర్థిక శక్తిని ప్రతిబింబిస్తుంది. అదేవిధంగా, రాబోయే కాలంలో ఇతర ఆర్థిక సంస్థలకు కూడా ఇది ఒక ప్రేరణగా మారవచ్చని వ్యాపార వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ముంబైలోని ప్రీమియం ప్రాంతంలో ఆర్బీఐ చేసిన ఈ భారీ భూమి కొనుగోలు ఈ ఏడాది దేశంలోనే అతిపెద్ద భూ ఒప్పందాల్లో ఒకటిగా నిలిచింది. ఇది కేవలం రియల్ ఎస్టేట్ రంగానికే కాకుండా, భారత ఆర్థిక రంగానికి కూడా ఒక కీలక మలుపు అని చెప్పవచ్చు.

# గాజులదిన్నె సంజీవయ్య సాగర్ ప్రాజెక్టులో వరద ఉధృతి రెండు గేట్లు ఎత్తివేత





మన గళం కోడుమూరు: గోనెగండ్ల మండలంలోని గాజులదిన్నె సంజీవయ్య సాగర్ ప్రాజెక్టులో వరద ప్రవాహం కొనసాగుతుంది ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 4.5 టీఎంసీలు కాగా శుక్రవారం 3.8 టీఎంసీలు నీటి నిల్వ ఉంది 15 క్యూసెక్కుల ఇంఫ్లోతో వరద ముప్పు పెరుగుతుంది టిడిపి చైర్మన్ మల్లికార్జున గౌడ్, కోడుమూరు వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ ఎల్లప్ప నాయుడు ఆధ్వర్యంలో అధికారులు రెండు గేట్లు ఎత్తి 2000 క్యూసెక్కుల నీటిని దిగువ హంద్రీ కు విడుదల చేశారు ఈ కార్యక్రమంలో బలరాం మరియు ఏఈ మరియు డి ఈ మరియు ప్రాజెక్టు డైరెక్టర్లు విలేకరులు పోలీస్ సిబ్బంది అధికారులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# 2047 నాటికి 5-10 ట్రిలియన్ డాలర్లకు చేరుకోనున్న భారత రియల్ ఎస్టేట్



మన గళం : దేశ రియల్ ఎస్టేట్ మార్కెట్‌గా 2047 నాటికి 5-10 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుందని కొలియర్స్, కాన్ఫెడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (క్రెడాయ్) సంయుక్త నివేదిక తెలిపింది. అంటే మన కరెన్సీలో ఇది రూ. 441.5 లక్షల కోట్ల నుంచి రూ. 883.2 లక్షల కోట్లకు పెరగవచ్చు. దీనివల్ల దేశ స్థూల దేశీయోత్పత్తి(జీడీపీ)కి దాదాపు ఐదో వంతు సహకారమని నివేదిక పేర్కొంది. ప్రస్తుతం 4 ట్రిలియన్ డాలర్లు(రూ. 353.2 లక్షక కోట్లు)గా ఉన్న మన దేశ జీడీపీ, 2047 నాటికి రూ. 35-40 ట్రిలియన్ డాలర్ల(రూ. 3,091-3,533 లక్షల కోట్ల)కు పెరుగుతుందని నివేదిక అంచనా కట్టింది. ప్రధానంగా పట్టణీకరణ, మౌలిక సదుపాయాల వృద్ధి, పెరుగుతున్న పెట్టుబడిదారుల ఆసక్తి కారణంగా ప్రస్తుతం 0.3 ట్రిలియన్ డాలర్లు(రూ. 26.5 లక్షల కోట్లు) అంటే జీడీపీ 6-8 శాతం విలువ కలిగిన రియల్ ఎస్టేట్ రంగం 2047 సమయానికి జీడీపీలో 14-20 శాతానికి చేరుకునే అవకాశాలు ఉన్నాయి. ప్రజల్లో మార్పు, పెరుగుతున్న ఆదాయం, సొంత ఇళ్లు ఉండాలనే ఆసక్తి కారణంగా నివాస ఇళ్ల అమ్మకాలు ప్రస్తుతం ఉన్న 3-4 లక్షల యూనిట్ల నుంచి 2047 నాటికి 8-10 లక్షల యూనిట్లకు పెరుగుతాయని అంచనా.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక
సినిమా, క్రీడా
శనివారం
13 - 09 - 2025


# 'కాంత' సినిమా విడుదల వాయిదా..





మన గళం : మలయాళ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్, భాగ్య శ్రీ బోర్సే కాంబోలో రాబోతున్న భారీ ప్రాజెక్ట్ 'కాంత'. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం 1950 మద్రాస్ నేపథ్యంలో సాగే కథతో రూపొందుతోంది. దీనిని స్పిరిట్ మీడియా బ్యానర్‌పై రానా దగ్గుబాటి, ప్రశాంత్ పొట్లూరి, జోమ్ వర్గీస్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా సెప్టెంబర్ 12న విడుదల కావాల్సి ఉండగా.. పలు కారణాల వల్ల వాయిదా పడింది. తాజాగా, మూవీ మేకర్స్ ఈ విషయాన్ని ప్రకటిస్తూ ట్విట్టర్ ద్వారా ఓ కీలక నోట్ రిలీజ్ చేశారు. "మా ప్రియమైన ప్రేక్షకులందరికీ నమస్కారం. కాంత టీజర్ విడుదలైన రోజు నుంచి మీరు చూపించిన ప్రేమ, ఆప్యాయం, మద్దతు మమ్మల్ని ఎంతో హత్తుకుంది. అది మాకు చాలా విలువైనది. మా చిత్రానికి సంబంధించి మీకు మరింత మెరుగైన అనుభూతి ఇవ్వాలనుకుంటున్నాం. 'కొత్త లోక' ఘన విజయంతో, చంద్ర బాక్సాఫీసులో దూసుకెళ్తూ కొనసాగాలని మేము కోరుకుంటున్నాం. అదే ఉత్సాహంతో, మిమ్మల్ని మరో అద్భుతమైన సినీ ప్రయాణంలోకి తీసుకెళ్లే ప్రత్యేక అనుభూతిని మేము సిద్ధం చేస్తున్నాం. ఆ దృష్ట్యా మా చిత్రం 'కాంత' విడుదల వాయిదా పడిందని మీకు తెలియజేస్తున్నాం. కొత్త రిలీజ్ తేదీని త్వరలోనే ప్రకటిస్తాము. అంతవరకు మాకు ఇలానే అండగా నిలుస్తారని ఆశిస్తున్నాము. త్వరలోనే మీ అందరినీ థియేటర్లలో కలవాలని ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నాము" అని రాసుకొచ్చారు. దీంతో ఈ విషయం తెలుసుకున్న దుల్కర్ అభిమానులు, సినీ ప్రియులు తీవ్ర నిరాశ చెందుతున్నారు.

# మాయాజాలాన్ని చూడటానికి సిద్ధంగా ఉండండి..



మన గళం : బాలీవుడ్ స్టార్ హీరో వరుణ్ ధావన్ నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'సన్నీ సంస్కారీకి తులసి కుమారి'. ఇందులో యంగ్ బ్యూటీ జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. సన్యా మల్హోత్రా, రోహిత్ సరాఫ్, అక్షయ్ ఒబెరాయ్ కీలక పాత్రలో కనిపించబోతున్నారు. రొమాంటిక్ కామెడీ చిత్రంగా రాబోతుండగా.. శశాంక్ ఖైతాన్ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాను ధర్మ ప్రొడక్షన్, మెంటర్ డిసిపుల్ ఫిల్మ్ బ్యానర్స్‌పై నిర్మిస్తున్నారు. షూటింగ్ శరవేగంగా జరుసుకుంటున్న ఈ మూవీ అక్టోబర్ 2న థియేటర్స్‌లోకి రాబోతుంది. దీంతో ప్రమోషన్స్ స్టార్ట్ చేసిన చిత్రబృందం వరుస అప్డేట్స్ ఇస్తోంది. తాజాగా, ఈ సినిమాకు సంబంధించిన అప్డేట్ రాబోతున్నట్లు సమాచారం. అందరూ ఎంతగానో ఎదురుచూస్తున్న 'సన్నీ సంస్కారీకి తులసి కుమారి' ట్రైలర్ సెప్టెంబర్ 15న రాబోతున్నట్లు టాక్. ఇక ఈ పోస్ట్‌కు "నిరీక్షణ ముగిసింది. ప్రేమ, రంగుల అతిపెద్ద వేడుక సిద్ధంగా ఉంది. మాయాజాలాన్ని చూడటానికి సిద్ధంగా ఉండండి" అని రాసుకొచ్చారు. ప్రస్తుతం ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దీంతో ఈ విషయం తెలుసుకున్న సినీ ప్రియులంతా ఫుల్ ఖుషీ అవుతున్నారు.

# ఆయనతో నా ప్రయాణం అందంగా ఉంటుంది..



మన గళం :పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో తెరకెక్కుతున్న మోస్ట్ అవైటెడ్ మూవీ 'ది రాజా సాబ్'. ఇందులో మాళవిక మోహనన్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. నిధి అగర్వాల్, రిద్ధి కుమార్, యోగిబాబు, సంజయ్ దత్ కీలక పాత్రలో కనిపించబోతున్నారు. ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై భారీ బడ్జెట్‌తో టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తుండగా.. షూటింగ్ కంప్లీట్ కాకపోవడం వల్ల విడుదల వాయిదా పడింది. దీంతో ఈ సినిమా డిసెంబర్ 5న రాబోతున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. భారీ అంచనాల మధ్య రాబోతున్న ఈ మూవీకి సంబంధించిన అప్డేట్స్ కోసం డార్లింగ్ అభిమానులు కళ్లు కాయలు కాసేలా వెయిట్ చేస్తున్నారనడంలో అతిశయోక్తి లేదు. ఈనేపథ్యంలో.. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న మాళవిక మోహన్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేసింది. "ప్రభాస్ చాలా అద్భుతమైన వ్యక్తి. ఆయన వయసులో నాకంటే పెద్దవాడు. కానీ ప్రభాస్‌ను చూసినప్పుడు అలా అనిపించదు. ఆయనతో కలిసి పనిచేయడం చాలా మధురంగా అనిపించింది. 'ది రాజాసాబ్'లో మా ప్రయాణం చాలా అందంగా ఉంటుంది. నిజానికి మేము సినిమాను పూర్తి చేశాము. ప్రస్తుతం కొన్ని పాటలను చిత్రీకరించాల్సి ఉంది. మీ అందరినీ అలరించేందుకు మా సినిమా సిద్ధంగా ఉంది" అని చెప్పుకొచ్చింది.

# హాంగ్ కాంగ్ పై బంగ్లాదేశ్ ఘన విజయం



మన గళం : ఆసియా కప్ 2025 సూపర్ టోర్నీలో బంగ్లాదేశ్ తన మొదటి మ్యాచ్‌లోనే ఘన విజయం సాధించింది. గురువారం జరిగిన పోరులో హాంగ్‌కాంగ్‌పై 8 వికెట్ల తేడాతో గెలిచి శుభారంభాన్ని నమోదు చేసుకుంది. ఈ విజయంతో బంగ్లాదేశ్ జట్టు టోర్నీకి మంచి ఆత్మవిశ్వాసాన్ని సంపాదించుకుంది. ముఖ్యంగా కెప్టెన్ లిటన్ దాస్ ఆకట్టుకునే బ్యాటింగ్ ప్రదర్శన చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. ముందుగా టాస్ కోల్పోయిన హాంగ్‌కాంగ్ జట్టు బ్యాటింగ్‌కు దిగింది. బంగ్లాదేశ్ బౌలర్లకు ఎదురీదేందుకు ప్రయత్నించినప్పటికీ వారు నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 143 పరుగులకే పరిమితమయ్యారు. కెప్టెన్ యసిమ్ ముర్తాజా కొంత ప్రతిఘటన కనబరిచాడు. కేవలం 19 బంతుల్లో 28 పరుగులు చేసి జట్టుకు ఊరటనిచ్చాడు. ఇందులో రెండు సిక్సులు, రెండు బౌండరీలు ఉన్నాయి. ఓపెనర్ జీషన్ అలీ కూడా కొంతసేపు క్రీజులో నిలిచి 34 బంతుల్లో 30 పరుగులు చేశాడు. నిజకత్ ఖాన్ మాత్రం మరింత సమర్ధవంతంగా ఆడి 42 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు.బంగ్లాదేశ్ బౌలర్లలో టస్కిన్ అహ్మద్, తంజీమ్ హసన్ షకీబ్, రిషద్ హొస్సేన్ అద్భుతంగా రాణించారు. వీరిలో ప్రతి ఒక్కరూ రెండు వికెట్లు తీసి హాంగ్‌కాంగ్ రన్‌ఫ్లోను అడ్డుకున్నారు. చివర్లో హాంగ్‌కాంగ్ బౌండరీలు కొట్టే ప్రయత్నం చేసినా, బంగ్లాదేశ్ బౌలర్లు కట్టుదిట్టమైన లైన్, లెంగ్త్‌తో వారిని కట్టడి చేశారు. అనంతరం బంగ్లాదేశ్ 17.4 ఓవర్లలో 3 వికెట్లకు 144 పరుగులు చేసి గెలుపొందింది. లిటన్‌దాస్‌కు తోడుగా టౌహిడ్ హృదయ్(36 బంతుల్లో ఫోర్‌తో 35 నాటౌట్) రాణించాడు. హాంగ్ కాంగ్ బౌలర్లలో అయుష్ శుక్లా, అతీక్ ఇక్బాల్ చెరో వికెట్ తీసారు. లక్ష్యచేధనలో బంగ్లాదేశ్ ఓపెనర్లు పర్వేజ్ హొూస్సేన్(19), తంజిద్ హసన్(14) త్వరగానే ఔటైనా.. కెప్టెన్ లిటన్ దాస్, టౌహిడ్ హృదయ్ ఆచితూచి ఆడారు. 44 బంతుల్లో లిటన్ దాస్ హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు.విజయం ముంగిట లిటన్ దాస్ క్లీన్ బౌల్డ్ కావడంతో మూడో వికెట్‌కు నమోదైన 95 పరుగుల భాగస్వామ్యానిక తెరపడింది. జాకెర్ అలీ(0 నాటౌట్)తో కలిసి టౌహిడ్ హృదయ్ విజయలాంఛనాన్ని పూర్తి చేశాడు. వరుసగా రెండు మ్యాచ్‌ల్లో ఓడిన హాంగ్ కాంగ్.. సూపర్-4 రేసు నుంచి తప్పుకుంది. ఆ జట్టు శ్రీలంకతో ఆఖరి మ్యాచ్ ఆడాల్సి ఉంది. అద్భుతం జరిగితే తప్పా హాంగ్ కాంగ్ ముందడుగు వేసే అవకాశం లేదు.

# వరల్డ్ నం.9 ప్లేయర్‌కు షాకిచ్చిన భారత యువ సంచలనం



మన గళం : హాంకాంగ్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత యువ ఆటగాడు ఆయుశ్ శెట్టి సంచలన ప్రదర్శన చేస్తున్నాడు. రెండో రౌండ్‌లో వరల్డ్ నం.9కు షాకిచ్చాడు. గురువారం జరిగిన మ్యాచ్‌లో ఆయుశ్ 21-19, 12-21, 21-14 తేడాతో జపాన్‌కు చెందిన కోడై నరోకాను చిత్తు చేశాడు. 31వ ర్యాంకర్ అయిన ఆయుశ్ తనకంటే మెరుగైన ర్యాంక్ కలిగిన ప్రత్యర్థిని ఓడించడానికి శక్తికి మించి పోరాడాడు. గంటా 12 నిమిషాలపాటు మ్యాచ్ సాగింది. పోరాటాన్ని నమ్ముకున్న ఆయుశ్ ఏమాత్రం పట్టుదల కోల్పోలేదు. పోరాడి మరి తొలి గేమును సాధించాడు. అనంతరం నరోకా బలంగా పుంజుకుని దూకుడు ప్రదర్శించడంతో ఆయుశ్ రెండో గేము కోల్పోయాడు. కానీ, నిర్ణయాత్మక మూడో గేములో మాత్రం అతను సంచలన ఆటతీరు ప్రదర్శించారు. ప్రత్యర్థి దూకుడుకు కళ్లెం వేయడమే కాకుండా అసలు పుంజుకునే చాన్స్ కూడా ఇవ్వలేదు. దీంతో ఏకపక్షంగా మూడో గేము నెగ్గి మ్యాచ్‌ను సొంతం చేసుకుని క్వార్టర్ ఫైనల్‌లో అడుగుపెట్టాడు. సూపర్ 500 లెవల్ టోర్నీలో ఆయుశ్ క్వార్టర్స్‌కు చేరడం ఇదే మొదటిసారి. భారత సింగిల్స్ స్టార్ ప్లేయర్ లక్ష్యసేన్ కూడా క్వార్టర్స్‌కు చేరుకున్నాడు. రెండో రౌండ్‌లో అతను మరో భారత స్టార్ హెచ్.ఎస్ ప్రణయ్‌పై విజయం సాధించాడు. మూడో గేములో ఫలితం తేలగా 15-21, 21-18, 21-10 తేడాతో సేన్ గెలుపొందాడు. ఆరు నెలల కాలంలో బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూరు ఈవెంట్‌లో సేన్ తొలిసారిగా క్వార్టర్స్‌కు చేరుకున్నాడు. ఇక, ఇటీవల వరల్డ్ చాంపియన్‌షిప్‌లో కాంస్యం గెలిచిన భారత డబుల్స్ స్టార్ ప్లేయర్లు సాత్విక్‌సాయిరాజ్ రాంకిరెడ్డి, చిరాగ్ శెట్టిలు తమ జోరు కొనసాగిస్తున్నారు. హాంకాంగ్ ఓపెన్‌లో క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లారు. రెండో రౌండ్‌లో ఈ భారత జంట 18-21, 21-15, 21-11 తేడాతో థాయిలాండ్‌కు చెందిన సుక్ఫున్-తీరరత్సకుల్ జోడీని ఓడించింది. ముందుగా తొలి గేము కోల్పోవడంతో సాత్విక్ జోడీకి మ్యాచ్‌లో శుభారంభం దక్కలేదు. ఆ తర్వాత దూకుడు పెంచి వరుసగా 2, 3 గేములను ఏకపక్షంగా గెలవడంతో మ్యాచ్ సొంతమైంది.

# భారత హాకీజట్టుకు నిరాశ



మన గళం : ఆసియాకప్ మహిళల హాకీలో భారతజట్టుకు సూపర్-4 రెండో లీగ్ మ్యాచ్‌లో నిరాశ తప్పలేదు. ఆతిథ్య చైనాతో గురువారం జరిగిన సూపర్-4లో భారతజట్టు 1-4గోల్స్ తేడాతో ఓటమిపాలైంది. తొలి మ్యాచ్‌లో కొరియాపై గెలిచిన భారతజట్టు శనివారం జరిగే చివరి సూపర్-4 మ్యాచ్‌లో జపాన్‌పై గెలిస్తే ఫైనల్‌బెర్త్ దక్కనుంది. ఉత్కంఠభరితంగా సాగిన ఈ మ్యాచ్‌లో భాగంగా మ్యాచ్ ప్రారంభమైన 4వ ని.లోనే చైనా తరఫున జో మిరాంగ్ గోల్ కొట్టి చైనాను 1-0 ఆధిక్యతలో నిలిచింది. ఆ తర్వాత రెండో క్వార్టర్‌లో ఇరుజట్లు గోల్ చేయకున్నా.. మూడో క్వార్టర్ ప్రారంభంలో 31వ ని.లో చెన్ యంగ్ గోల్ చేయడంలో చైనా 2-0 ఆధిక్యతలోకి దూసుకెళ్లింది. ఈ క్రమంలో భారత్ తరఫున ముంతాజ్ ఖాన్(38వ ని.లో)లో గోల్ చేయడంతో చైనా ఆధిక్యత 1-2కు తగ్గింది. నాల్గో క్వార్టర్‌లో భారత క్రీడాకారిణులు పోరాడినా.. ప్రయోజనం లేకపోయింది. ఆ దశలో జూ(56వ ని.లో) మరో గోల్ చేయడం, జిన్షు(47వ ని.లో) గోల్ చేయడంతో చైనా 1-4గోల్స్‌తో విజయఢంకా మోగించింది. కొరియా-జపాన్ జట్ల మధ్య జరిగిన మరో సూపర్-4 మ్యాచ్ 2-2గోల్స్‌తో డ్రా అయ్యింది. దీంతో శనివారం జరిగే చివరి లీగ్ మ్యాచ్‌లో భారతజట్టు జపాన్‌తో, చైనా జట్టు కొరియాతో తలపడనున్నాయి. ఈ మ్యాచ్‌లో కొరియా జట్టు చైనాను ఓడిస్తేనే సమీకరణలు మారనున్నాయి. భారతజట్టు జపాన్‌ను ఓడిస్తే ఫైనల్ బెర్త్ ఖాయం.

# టీ20 క్రికెట్‌లో చరిత్ర సృష్టించిన అభిషేక్ శర్మ

మన గళం : ఆసియా కప్ 2025 క్రికెట్ టోర్నమెంట్‌కు ఆతిథ్యమిచ్చిన యూఏఈతో భారత్ జట్టు తన తొలి మ్యాచ్‌లోనే అద్భుత ప్రదర్శనతో అభిమానులను ఉత్సాహపరిచింది. బుధవారం దుబాయ్ వేదికగా జరిగిన ఈ పోరులో, ఆతిథ్య యూఏఈ జట్టును భారత్ 9 వికెట్ల తేడాతో చిత్తు చేసింది. ఈ విజయంతో టోర్నీలో భారత్ తన శుభారంభం నమోదు చేసుకుంది. ఈ మ్యాచ్‌లో ప్రధాన ఆకర్షణగా నిలిచింది యువ ఓపెనర్ అభిషేక్ శర్మ. భారత ఇన్నింగ్స్ ఆరంభంలో ఎదుర్కొన్న తొలి బంతికే సిక్స్ బాది, టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో అరుదైన రికార్డును తన పేరుతో ముద్రించాడు. ఇంతవరకు ఏ భారత బ్యాటర్‌కూ సాధ్యం కాని ఈ ఘనతను అభిషేక్ తన ఖాతాలో వేసుకోవడం విశేషం. ఈ ప్రత్యేక క్షణం అభిమానుల్లో సంబరాలు రేపింది. దుబాయ్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ తొలుత బౌలింగ్ ఎంచుకున్నాడు. కెప్టెన్ నమ్మకాన్ని నిలబెడుతూ భారత బౌలర్లు నిప్పులు చెరిగారు. స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ తన మాయాజాలంతో యూఏఈ బ్యాటింగ్ ఆర్డర్‌ను కుప్పకూల్చాడు. కేవలం 2.1 ఓవర్లలో 7 పరుగులు మాత్రమే ఇచ్చి 4 కీలక వికెట్లు పడగొట్టాడు. అతనికి శివమ్ దూబే (3 వికెట్లు) చక్కటి సహకారం అందించడంతో యూఏఈ జట్టు 13.1 ఓవర్లలో కేవలం 57 పరుగులకే ఆలౌటైంది.అనంతరం 58 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఓపెనర్ అభిషేక్ శర్మ మెరుపు ఆరంభాన్నిచ్చాడు. హైదర్ అలీ వేసిన ఇన్నింగ్స్ తొలి బంతికే భారీ సిక్స్ కొట్టి తన ఉద్దేశాన్ని చాటాడు. కేవలం 16 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్సర్లతో 30 పరుగులు చేసి ఔటయ్యాడు. 'వికెట్ ఎలా స్పందిస్తుందో చూడటానికే బౌలింగ్ ఎంచుకున్నాను.

Editor, Printed, Published and Owned by S. T. KHALEEL BASHA. H.NO. 46-156-E2, BUDHAVAR PETA, KURNOOL DIST. A.P. - 518004.
PRINTED AT G.K PUBLICATIONS, BANDIMETTA STREET, KURNOOL DIST. AP- 518004, RNI : APTEL/ 2017/74310